








బొమ్మల సెంటర్‌లో మాట్లాడుతున్న ఏలూరి సాంబశివరావు, కృష్ణప్రసాద్

పర్చూరు జన జాతర

- ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏలూరి నామినేషన్
- జనసంద్రంగా మారిన బొమ్మల సెంటర్
- గజమాలతో స్వాగతం పలికిన జన సైనికులు

పర్చూరు, ఏప్రిల్ 22: కూటమి తరపున పర్చూరు అసెంబ్లీ స్థానంలో టీడీపీ అభ్యర్థిగా ఏలూరి సాంబశివరావు సోమవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు భారీ ర్యాలీగా తరలివచ్చాయి. డప్పు వాయిద్యాలు, మహిళా నృత్యాలతో పర్చూరు బొమ్మల సెంటర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మార్టూరు మండలం ఇసుక దర్శి క్యాంపు కార్యాలయం నుంచి పర్చూరు వరకు సాగిన భారీ ర్యాలీలో గ్రామగ్రామాన ప్రజ లు ఏలూరికి బ్రహ్మరథం పట్టారు. పర్చూరు చేరుకున్న ఏలూరి స్థానిక సాయిబాబా ఆల యంలో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం బొమ్మల సెంటర్‌కు చేరుకున్న ఏలూరికి జన సైనికులు భారీ గజమాలతో స్వాగతం పలికారు. ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావడంతో పర్చూరు బొమ్మల సెంటర్ కిక్కిరిసిపోయింది. మండు టెండను కూడా లెక్కచేయకుండా గంటల తరబడి నిరీక్షించిన జనం ఏలూరిపై అభిమానం చాటుకున్నారు. ఏలూరి సాంబశివరావు, బాపట్ల లోక్‌సభ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కూడలిలో జరిగిన బహిరంగ సభలో ఏలూరి మాట్లాడుతూ జగన్ అక్రమ సంపాదన కోసం రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. జగన్ దుర్మార్గపు పాలనలో ప్రజాప్రతినిధులు కూడా దాచుకో దోచుకో అన్నట్లుగా మారిపోయారని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ ఇస్తానని యువ తను మోసం చేసిందని, దీంతో ఉద్యోగాలు లేక యువత కూలీలు, ఆటో డ్రైవర్లుగా మారారన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టిందన్నారు. అరాచక విధ్వంస వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు.



జన సందోహంతో కిక్కిరిసిన పర్చూరు బొమ్మల సెంటర్

- పండించిన పంటకు గిట్టుబాటు దక్కక అన్నదాతల అవస్థలు
- జిల్లాలో నాలుగేళ్లుగా ఏటికేడు తీసికట్టుగా ధాన్యం సేకరణ
- నామమాత్రంగానే మార్క్‌ఫెడ్ పాత్ర
- దిగుబడులకు, సేకరణలకు పొంతనే ఉండని వైనం
- రైతుల ఆక్రందన పట్టని వైసీపీ ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వని పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పిస్తుంది.. పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచే ఏర్పాటు చేస్తాం.. ఇలా ఒకటేమిటి ఎన్నో వాగ్దానాలు 2019కు ముందు సీఎం జగన్ గుప్పించారు. అయిదేళ్ల తర్వాత సీన్ కట్‌చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించే సంగతి దేవుడెరుగు.. ఏటికేడు రైతుల దగ్గర నుంచి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసే ధాన్యం పరిమాణం పడిపోతూ వస్తోంది. పైగా కొనుగోలు కేంద్రాలూ అందుబాటులో ఉండవు.

అరకొరగా కొనుగోలు చేసిన ధాన్యం విషయంలో డబ్బులు పడడం మరో ప్రహసనం. ఇక వాణిజ్య పంటలైన మినుము, పెసరతో పాటు మొక్కజొన్న తదితర పంటల కొనుగోలు విషయంలో మార్క్‌ఫెడ్ పాత్ర నామమాత్రం. మొక్కుబడి తంతుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం తప్పితే జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పంటల సంగతి అడిగితే నీళ్లు నమలడం అధికారుల వంతవుతోంది. పైగా రైతు భరోసా కేంద్రాలలో ఎరువుల పంపిణీ విషయంలో మార్క్ ఫెడ్‌ను చేర్చి దాని అసలు ఉద్దేశం నీరుగార్చే ప్రక్రియకు తెరలేపిన ఘనత వైసీపీది. ఈ విధంగా ఐదేళ్లలో జిల్లా లోని రైతాంగానికి అడుగడు గునా అన్యాయం చేసిన ప్రభుత్వంగా వైసీపీ ప్రభుత్వం మిగిలిపోయిందని రైతులు విమర్శిస్తున్నారు.

మద్దతు ధర.. ఎండమావే!

బాపట్ల, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ విషయంలో ఏటికేడు తీసికట్టే అన్నట్లు ఉంటోంది. 2023–24కు సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో 78,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. ముగింపుకొచ్చేసరికి అదికాస్తా 28,500 మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. గతేడాది ఖరీఫ్‌లో అయితే 1,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం పెట్టుకుంటే ఇది కాస్తా 75,000 మెట్రిక్ టన్నుల దగ్గరే ఆగింది. తాజా ఖరీఫ్‌లో సేకరణ గతంతో పోలిస్తే దారుణంగా పడిపోయింది. రబీ సీజన్‌లోనూ ఇదే తంతు. పెట్టుకున్న లక్ష్యాలకు సేకరణకు హస్తిమశకాంతరం ఉంటోంది. ఈ ఐదేళ్లలో ఏ ఒక్క సంవత్సరం కూడా ధాన్యం సేకరణ పరిమాణం పెరగకపోగా సీజన్, సీజన్‌కు తగ్గుదల నమోదవడం గమనార్హం.

సొమ్ము జమ చేయడంలోనూ నిర్లక్ష్యమే..

అరొకరగా సేకరించిన ధాన్యానికి సొమ్ము జమ చేయడంలోనూ వైసీపీ ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపెట్టింది. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే డబ్బు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయి తప్పితే రైతులకు కష్టాలు తప్పలేదు. టీడీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. ఈ అయిదేళ్లలో డబ్బు జమ విషయంలో వైసీపీ వేసిన పిల్లిమొగ్గలు అన్నీఇన్నీ కావు. ధాన్యం సేకరణ విషయంలోనూ ఏకీకృతం అనే కొత్త ఎత్తుగడకు వైసీపీ ప్రభుత్వం తెరతీసింది. ధాన్యం సేకరణను గుత్తాధిపత్యం చేసే ఆలోచనలో భాగంగా ఒకే మిల్లరుకు అప్పగించేలా టెండర్లను కూడా పిలిచింది. ఇది ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

మార్క్‌ఫెడ్ పాత్ర నామమాత్రమే...

జిల్లా ఆవిర్భావం తర్వాత మార్క్‌ఫెడ్ బాపట్లలో కొలువుదీరడానికే దాదాపు ఏడాది పట్టింది. వచ్చిన తర్వాత అయినా పూర్తిస్థాయిలో పనిచేయడం మొదలుపెట్టిందా అంటే అదీ లేదు. ఏదో మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు తెరిచి మమ అనిపించడం మినహా అన్నదాతల నుంచి సేకరించిన దిగుబడులు తీసికట్టే. జిల్లాలో మినుము దాదాపు 50,000 హెక్టార్ల లో సాగు అవుతుండగా, పెసర, శనగ కలిపి దాదాపు 35,000 హెక్టార్ల వరకు సాగు విస్తీర్ణం ఉంది. వీటికి తోడు జొన్న, మొక్కజొన్న, శనగ సేకరణ కూడా మార్క్‌ఫెడ్ బాధ్యతే. మద్దతు ధర మినుము క్వింటాలకు రూ.6,950 ఉండగా, పెసర క్వింటాకు రూ.8,558గా ఉంది. సాగైన విస్తీర్ణంతో పోల్చుకుంటే మొక్కజొన్నతో కూడా కలుపుకుని కనీసం 30,000 టన్నులైనా మార్క్‌ఫెడ్ సేకరించాల్సి ఉంటుంది. కానీ ఈ రెండేళ్లలో మార్క్‌ఫెడ్ పట్టుమని పదివేల టన్నులైనా సేకరించిన దాఖలాలు లేవు. దిగుబడులు దాదాపు లక్ష మెట్రిక్ టన్నులపైన ఉంటే మార్క్‌ఫెడ్ విధించుకునే సేకరణ లక్ష్యాలు పదిశాతం లోపే. దానిని చేరడానికి కూడా ఆపసోపాలు పడే పరిస్థితి ప్రభుత్వానిది.

పంట పండించుకుంటున్న దళారులు...

ప్రభుత్వం మద్దతు ధర విషయంలో రైతులకు చేస్తున్న అన్యాయం దళారులకు వరంగా మారుతోంది. ముఖ్యంగా ధాన్యం మద్దతు ధర విషయంలో ప్రభుత్వం విధించే అలవిమాలిన నిబంధనలు అన్నదాతలకు గుదిబండగా మారి కొనుగోలు కేంద్రాల వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇక ధాన్యం డబ్బుల జమ విషయంలో నెలల తరబడి జరుగుతున్న జాప్యం కూడా వారిని దళారుల వైపు మళ్లేలా పురిగొల్పుతోంది. దీంతో ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇలా ఈ ఐదేళ్లలో మద్దతు ధర విషయంలో రైతులు నిలువునా మోసానికి గురయ్యారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన ధరల స్థిరీకరణ నిధి ఎక్కడ ఉందో పాలకులకే తెలియాలి. ఇక మిర్చి రైతుల గోడు వినేవారే కరువ య్యారు. జిల్లాలో ధాన్యం తర్వాత ఉద్యాన పంట అయినా మిర్చి వైపు అన్నదాతలు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. కేంద్రం మద్దతు ధర ఇవ్వని పంటలకు తన ప్రభుత్వం ఇస్తుందని జగన్ చెప్పిన మాటలను ఎన్నికల వేళ సీఎంకు రైతులు గుర్తు చేస్తున్నారు.

రకరకాల సాకులు

మద్దతు ధర విషయంలో అన్నదాతలకు జరుగుతున్న అన్యాయం విషయంలో ప్రభుత్వం ఏవో కుంటిసాకులు చెబుతూనే వస్తోంది. ఆర్బీకేలకు అనుసంధానంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామనే మార్క్‌ఫెడ్ మాటలు ఉత్తమాటలుగానే మిగిలిపోతున్నాయి. ఏదో మొక్కుబడిగా ఒకటిరెండు రోజులు ఏర్పాటు చేయడం తర్వాత సర్దేయడం రివాజుగా మారింది. పైగా బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండడం వల్ల మద్దతు ధరకు అమ్ముకోవడానికి అన్నదాతలు ఆసక్తి చూపించడం లేదని చెబుతారు. ఇది కొంతమేర వాస్తవమే అయినప్పటికీ సమాంతరంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరచి ఉంటేనే బయటి మార్కెట్‌లో ధర స్థిరంగా ఉంటుందనే ప్రాథమిక సూత్రాన్ని కూడా మరచి అన్నదాతలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. ఇక పత్తి కొనుగోలు విషయంలో సీసీఐది కీలక పాత్ర. దీనికి సంబంధించి బాపట్ల జిల్లాలో ప్రతినిధులెవరో, కార్యాలయమెక్కడో ఎవరికీ తెలియదు.



వేమూరులో ప్రచార రథంపై నుండి ప్రజలకు అభివాదం చేస్తున్న ఆనందబాబు



గుర్రంపై ఎక్కి ర్యాలీలో పాల్గొన్న ఆనందబాబు

వేమూరు..జనసందోహం

అట్టహాసంగా నక్కా ఆనందబాబు నామినేషన్ • టీడీపీ, జనసేన శ్రేణుల భారీ ప్రదర్శన

వేమూరు, ఏప్రిల్ 22: కూటమి తరపున వేమూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు సోమ వారం నామినేషన్ వేశారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన అశేష జనసందోహం మధ్య ఆయన నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఉదయం 10గంటలకు ఐదు మండలాల పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పార్టీ జెండాలు, ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వేమూరు ఎన్టీఆర్ పుర వేదిక వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తొలుత మహిళలు గుమ్మడి కాయలతో ఆనందబాబుకు దిష్టితీసి కర్పూర హారతులు ఇచ్చారు. బాణసంచా, రాజస్థాన్ బ్యాండ్, జయ జయ ధ్వానాలతో యువత ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. ఎన్టీఆర్, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొల్లూరు-తెనాలి ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించగా అడుగడుగునా పార్టీశ్రేణులు స్వాగతం పలికాయి. మార్గమధ్యలో మహిళలు ఆపి ఆనందబాబుకు తిలకం దిద్ది పూలమాలలు వేసి హారతులతో ఆశీర్వదించారు. తహసీల్దారు కార్యాలయ సమీపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆనందబాబు తహసీల్దా రు కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆనందబాబుకు జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, బాపట్ల లోక్‌సభ టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, కొల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, నాయకులు బట్టు మల్లికార్జున, షాలెంరాజు, తమ్మా శివారెడ్డి, శరత్‌చంద్ర, డాక్టర్ మధుసూదన్‌ప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబు, ఎల్లారెడ్డి, బ్రహ్మానందం, శరణుగిరి, విష్ణుమొలకల శ్రీనివాసరావు, దండే సుబ్బారావు, చలమయ్య, షేక్ హనీఫ్ పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు.



వేమూరులో ఆర్‌ఓకు నామినేషన్ పత్రం అందజేస్తున్న నక్కా ఆనందబాబు ఆలపాటి రాజా తదితరులు



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నక్కా ఆనందబాబు

బాలికలదే హవా...

- 'పది' ఫలితాల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- బాపట్ల 88.19, గుంటూరు 88.14, పల్నాడు 86.05 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 14, 16, 18 స్థానాల్లో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలు

గుంటూరు(విద్య), నరసరావుపేట, బాపట్ల టౌన్, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా చూపారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పది పరీక్షలకు సంబంధించి ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఉత్తీర్ణతలో ముందు ఉన్నారు. గుంటూరు జిల్లా నుంచి 27,178 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 23,955 మంది (88.14 శాతం ఉత్తీర్ణత సాధించారు.

బాపట్లజిల్లా నుంచి 16718 మంది హాజరుకాగా 14,743 మంది (89.19 శాతం) సాధించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 11శాతం ఉత్తీర్ణత పెరిగింది. జిల్లాలో అబ్బాయిలు 86.32, అమ్మాయిలు 91.11శాతం ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు జిల్లాలో అబ్బాయిలు 86.46, అమ్మాయిలు 89.9శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో బాపట్ల జిల్లాకు 14వ స్థానం దక్కింది.

పల్నాడుజిల్లా నుంచి 24,959 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 21,477 మంది (86.05 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. పల్నాడులో అబ్బాయిలు 83.77, అమ్మాయిలు 88.45శాతం ఉత్తీర్ణత సాధించారు. 16,769 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత కాగా 3,482 మంది ఫెయిలయ్యారు. గత ఏడాది కంటే ఉత్తీర్ణత 17.10 శాతం పెరిగింది. రాష్ట్రంలో పల్నాడు జిల్లా 18వ స్థానంలో నిలిచింది. గతేడాది బాపట్లజిల్లా 75.31 శాతం, గుంటూరు 77.4 శాతం, పల్నాడు 69.47 శాతంగా నమోదైంది. అంటే ఈ ఏడాది ఫలితాలు మెరుగైనట్లే.

యాప్‌లే కారణమా.. విద్యారంగ ఖిల్లాగా పేరొందిన గుంటూరు జిల్లా పది ఫలితాల్లో చతికల పడింది. ఒకప్పటి ఉమ్మడి రాష్ట్రంలో టాప్‌టెన్‌లో ఉన్న జిల్లా ఈ ఏడాది దిగజారింది. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ హడావిడి ఫలితాల్లో ఎక్కడా కనపించలేదు. యాప్‌ల యావ తప్ప.. పర్యవేక్షణా లోపం ఫలితాల సాధనలో స్పష్టంగా కనిపించింది. హెచ్‌ఎం స్థాయి నుంచి స్కూల్ అసిస్టెంట్ వరకు ఏదో ఒక యాప్‌ల పనుల్లోనే మునిగిపోయారు. ఉదయం మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం, గుడ్లు పంపిణీ, చిక్కీల పంపిణీ, నాడు నేడు పనుల పర్యవేక్షణ ఇలా ప్రతిదానికీ యాప్‌లతోనే ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. మరో వైపు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పాఠశాలలకు వచ్చిచేసే హడావిడితో అసలు బోధనే మరుగున పడి ఫలితాల్లో వెనుకంజ పడినట్లు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

పల్నాడు జిల్లాలోని అనేక పాఠశాలల నుంచి సబ్జెక్టు టీచర్లు గుంటూరు జిల్లాలోని అనేక పాఠశాలల్లో అక్రమ బదిలీపై చేరిపోయారు. దీంతో అక్కడ భారీస్థాయిలో టీచర్ల కొరత ఏర్పడింది. కనీసం విద్యా వలంటీర్లను నియమించుకునే అవకాశం కూడా ప్రభుత్వం కల్పించలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు జడ్పీ, ప్రభుత్వ, కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కనీసం పరీక్షల సమయంలో అల్పాహారం అందించలేని దుస్థితి నెలకొంది, ఇలా అనేక కారణాలతో ఉమ్మడి జిల్లాలో ఉత్తీర్ణత దిగజారినట్లు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు విశ్లేషించారు.

కాంగ్రెస్ అభ్యర్థుల మలి విడత జాబితా విడుదల

గుంటూరు, ఏప్రిల్ 22: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మలి విడత జాబితాను ఆ పార్టీ అధిష్టానం సోమవారం రాత్రి విడుదల చేసింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి డాక్టర్ రాచకొండ జాన్‌బాబు, తెనాలి నియోజకవర్గం నుంచి షేక్ బాషీద్, రేపల్లె మోపిదేవి శ్రీనివాసరావు కాగా ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన తాడికొండకు మణిచల సుశీల్‌రాజాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాడికొండకు చిలకా విజయ్‌కుమార్‌ను తొలి జాబితాలో ప్రకటించి తాజాగా ఆయన్ను తప్పించి ఆయన స్థానంలో సుశీల్ రాజాను నియమించటం, తెనాలిలో పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ, తొలి నుంచి టికెట్ ఆశించిన డాక్టర్ చందు సాంబశివుడును కాదని వేరొకరికి టికెట్ కేటాయించటంపై పార్టీలో చర్చనీయాంశంగా మారింది.



మంగళగిరి అభివృద్ధే నా ఏకైక లక్ష్యం

- మంగళగిరి నియోజకవర్గ కూటమి అభ్యర్థి నారా లోకేశ్
- కాజాలో అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశం



లోకేశ్‌కు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న జాస్మిన్ అపార్టుమెంట్‌వాసులు

మంగళగిరి, ఏప్రిల్ 22: అన్నీ ప్రాంతాల్లో సమగ్రమైన రీతిలో మౌలికసదుపాయాలు.. అందమైన పార్కులు, ఆటస్థలాలు, ఆరోగ్య కేంద్రాలు, యువతకు ఉపాధి ఉద్యోగవకాశాలు.. ఎటు చూసినా ఆహ్లాదకరమైన వాతావరణం... ఇదే.. నా మంగళగిరి అభివృద్ధి విజన్! మళ్లీ చెబుతున్నా.. దేశం మొత్తంమీద అభివృద్ధికి కేరాఫ్‌గా మంగళగిరి వుంటుందని స్థానిక టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఉదయం ఆయన కాజలోని ఏఆర్ అపార్టుమెంట్, జాస్మిన్ అపార్టుమెంట్ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా మురుగుడు హనుమంతరావు కుటుంబానికి, ఆళ్ల రామకృష్ణారెడ్డికి మీరు అవకాశమిచ్చారు. కానీ ఇక్కడి ప్రజల జీవితాల్లో ఎటువంటి మార్పు రాలేదు. ఒక్క పరిశ్రమ రాలేదు. ఒక్కరికీ ఇంటిపట్టాను ఇవ్వనూ లేదు. నాకు ఒక్క అవకాశం ఇచ్చి చూడండి... మంగళగిరి రూపురేఖలు మారుస్తా.. ఇక్కడి ప్రజల జీవితాల్లోకి వెలుగులు తీసుకొస్తానంటూ లోకేశ్ హామీనిచ్చారు. నేను గతంలో ఇక్కడ ఓడినా ప్రజల కోసం 29 రకాల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాను. టీసీఓ కంపెనీని తీసుకొచ్చి 150 మందికి ఉద్యోగాలను ఇప్పించాను. ఇక ఎమ్మెల్యేగా అవకాశమిస్తే మంగళగిరిని ఏస్థాయిలో అభివృద్ధి చేస్తానో మీరే వూహించుకోవాలన్నారు. మంగళగిరి అభివృద్ధే తన ఏకైక లక్ష్యమని చెప్పారు. మంగళగిరిలో బ్లాక్ మోడల్ అభివృద్ధిని తీసుకొస్తానన్నారు. నియోజకవర్గ మంతటా భూగర్భ డ్రైనేజిల నిర్మాణం.. ఇంటింటికి శుద్ధి చేసిన కృష్ణాజలాల పంపిణీ, జోన్ మోడల్‌లో పెద్దపెద్ద పార్కులు, ఆటస్థలాలు, ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తామని లోకేశ్ వివరించారు.

మంగళగిరిలో చేనేత తరువాత ఎక్కువమంది యువత స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారిని ఆదుకోవల్సిన బాధ్యత తనపై వుందన్నారు. మంగళగిరిలో అతిపెద్ద గోల్డ్ హబ్‌ను ఏర్పాటుచేయడం ద్వారా స్వర్ణకార వృత్తిదారుల తలరాతలను మార్చివేస్తానన్నారు. 50నుంచి వంద ఎకరాల్లో ఈ గోల్డ్‌హబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. దీనివలన 30 వేలనుంచి 40 వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని లోకేశ్ వివరించారు. తనిష్క్, జోయాఅలుక్కాస్ వంటి పెద్దపెద్ద జ్యూయలరీ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని వారికి కావల్సిన ఆభరణాలను ఇక్కడే తయారుచేయిస్తాం. ల్యాబ్ డైమండ్స్ తయారీని కూడ ప్రోత్సహిస్తామని చెప్పారు. ఆభరణాల తయారీ అంటే మంగళగిరి గుర్తుకొచ్చేలా ఈ గోల్డ్‌హబ్‌ను అభివృద్ధి చేస్తామని వివరించారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరికి అనేక ఐటీ పరిశ్రమలను తీసుకువచ్చామని లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాబోయే కూటమి ప్రభుత్వంలోనూ ఐటీ పరిశ్రమలను మరిన్నింటిని మంగళగిరికి తీసుకువస్తామన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య, బెస్ట్ ఎవైలబుల్ స్కూల్స్ పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. విద్యాదీవెన పథకం స్థానంలో తిరిగి పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని తీసుకువస్తామన్నారు. ఉద్యోగులకు ప్రతీనెలా 1న జీతాలు అందేలా తమ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ అభివృద్ధిని చూడాలంటే ప్రజలు తనకు అండగా నిలిచి అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమాల్లో జనసేన చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎంటీఎంసీ జనసేన అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, తోట పార్థసారధి, గాదె పిచ్చిరెడ్డి, పల్లబోతుల శ్రీనివాసరావు, జవ్వాది కిరణ్‌చంద్, మాదల రమేష్, నంబూరు రవి, మన్నెం సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

టీడీపీ కార్యాలయానికి నిప్పు

- నాగిరెడ్డిపాలెంలో దుండగుల దుశ్చర్య
- దహనమైన కార్యాలయాన్ని పరిశీలించిన భాష్యం ప్రవీణ్



దహనమైన టీడీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఏప్రిల్ 22: పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు టీడీపీ కార్యాలయానికి నిప్పంటించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు హుటాహుటిన కార్యాలయం వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం సత్తెనపల్లి డీఎస్పీ గురునాథం, క్రోసూరు సీఐ మంగారావు తెల్లవారు జామున నాలుగు గంటలకు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి మాట్లాడుతూ కావాలనే వైసీపీ నాయకులు టీడీపీ కార్యాలయాన్ని దహనం చేశారని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఎంపీ అభ్యర్థి శ్రీ కృష్ణ దేవరాయలు సోదరి రాణి రుద్రమదేవి ప్రచారం నిర్వహిస్తుండగా వైసీపీ నాయకులు వారి ప్రచార రథాలను అడ్డు పెట్టేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఇతర గ్రామాల నుంచి 200 మంది కార్యకర్తలను రప్పించి దాడిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని, టీడీపీ కార్యకర్తలపై రాళ్ళు రువ్వారని తెలిపారు. తెల్లవారు జామున 2గంటల సమయంలో ఎవరూ లేకుండా చూసి పార్టీ కార్యాలయాన్ని దహనం చేయటం ఏంటని? ప్రశ్నించారు. అనంతరం సుమారుగా 9 మందిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఇది పిరికిపంద చర్య : భాష్యం ప్రవీణ్

టీడీపీ కార్యాలయాలను దహనం చేయటం పిరికిపంద చర్య అని పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. బాష్యం ప్రవీణ్, గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డితో కలసి దహనమైన కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో క్రోసూరు పార్టీ కార్యాలయాన్ని దహనం చేశారని, ఇప్పుడు బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం పార్టీ కార్యాలయాన్ని దహనం చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. పెదకూరపాడు వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు వస్తే మస్టర్ ఫ్రీగా వేస్తామని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూలీలకు చెపుతున్నారని భాష్యం ప్రవీణ్ ఆరోపించారు. వెన్నా సాంబశివారెడ్డి మాట్లాడుతూ నాగిరెడ్డిపాలెం గ్రామంలో టీడీపీకి పూర్తి మెజార్టీ వస్తుందనే ఉద్దేశంతో భయభ్రాంతులకు గురిచేయాలనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆయన వెంట రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోర్‌కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, సర్పంచ్ జ్యోతి సముద్రం, గుడిసె కొండయ్య, గుంజా గంగారావు, ఓర్సు ఆనంద్, తమ్మిశెట్టి సత్యనారాయణ, హనుమంతరావు నాయక్, రామకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిధర్‌కు నగర బాధ్యతలు

- ఎమ్మెల్యే అభ్యర్థిగా పీకేశారు..
- ఆర్యవైశ్య సామాజికవర్గం ఓట్ల కోసమేనంటూ విమర్శలు

గుంటూరు, ఏప్రిల్ 22: వైసీపీ నగర అధ్యక్షుడుగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్టానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నామినేషన్‌ల తరుణంలో ఎమ్మెల్యే గిరిధర్‌కు నగర అధ్యక్ష పదవీ బాధ్యతలు అప్పగించటంపై ఆ పార్టీలోనే భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన మద్దాళి గిరిధర్‌ను పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిపి గెలిపించారు. అనంతరం పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే గిరిధర్ వైసీపీలోకి జంప్ చేసిన విషయం తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో కూడా వైసీపీ టిక్కెట్ తనకే వస్తుందని గిరిధర్ ఆశపడ్డారు. చివరకు గిరిధర్‌ని కాదని వైసీపీ అధిష్టానం చిలకలూరిపేట నుంచి మంత్రి విడదల రజినీని వైసీపీ అభ్యర్థిగా పశ్చిమ బరిలో నిలపటంపై ఆర్యవైశ్య సామాజిక వర్గీయులు గుర్రుగా ఉన్నారు. పైగా ఇటీవల పార్టీలో ఎమ్మెల్యే గిరిధర్‌కు ప్రాధాన్యత కూడా తగ్గుతోందని ప్రచారం జరుగుతోంది. దాదాపు మూడేళ్ళ నుంచి వైసీపీ నగర అధ్యక్ష పదవి ఖాళీగానే ఉంటోంది. ఎన్నికల సమయంలో హఠాత్తుగా ఎమ్మెల్యే గిరిధర్‌కు నగర అధ్యక్ష పదవీ బాధ్యతలు అప్పగించి ఆ వర్గం ఓట్లు పొందేందుకు కొత్త ఎత్తుగడగా పార్టీలోని కార్యకర్తలే గుసగుసలాడుకుంటున్నారు. ఈ సందర్భంగా నగర పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌కు ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి, తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా, డీసీసీబీ చైర్మన్ రాతంశెట్టి రామాంజినేయులు, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

అమరావతి నమూనాల పరిరక్షణకు చర్యలు

తుళ్లూరు,ఏప్రిల్22: అమరావతి నమూనాల పరిరక్షణకు సీఆర్డీఏలోని ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయటం జరిగింది. ఈ బృందం అమరావతి ప్రాంతంలో క్షేత్రస్థాయిలో సందర్శిస్తారు. సీఆర్డీఏకు సంబంధించిన నమూనాలను నిరంతరం తనిఖీ చేస్తారు. ఉద్దండ్రాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన చేసిన ప్రదేశంలో ప్రత్యేక సెక్యూరిటీ గార్డులను నియమించి అక్కడ నమూనాల పరిరక్షణకు ప్రత్యేకచర్యలు చేపట్టామని ఏపీ సీఆర్డీఏ కమీషనర్ వివేక్ యాదవ్ తెలిపారని కార్యలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.



క్షతగాత్రులను పరామర్శించిన కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

టీడీపీ కార్యకర్తలపై దాడి

- ముగ్గురికి తీవ్రగాయాలు .. పరామర్శించిన కన్నా

సత్తెనపల్లి, ఏప్రిల్ 22: టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయ పరిచిన ఘటన మండలంలోని పెద మక్కెన-పెదకూరపాడు మధ్యలోగల పెట్రోల్‌బంకు వద్ద సోమవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ నామినేషన్ కార్యక్రమానికి తరలి వచ్చేందుకు పెద మక్కెనకు చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నేతలు మత్తుపల్లి మేరి బాబు, నాగరాజు, మత్తుపల్లి సంగీతరావు, జరుగుమల్లి ఏసయ్య, దిడ్ల పెద నాగరాజు, అనిల్ తదతరులు సమీపంలోని పెట్రోల్ బంకుకు వెళ్ళారు. అక్కడ జైబాలయ్య.. టీడీపీ వర్ధిల్లాలం టూ నినాదాలు చేశారు. ఆ సమయంలో పెదకూర పాడు వైసీపీ నామినేషన్‌కు వెళ్తున్న వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయి టీడీపీ కార్యకర్తలపై రాళ్ళు కర్రలతో దాడిచేశారు. స్థానికులు వారిని సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కన్నా లక్ష్మీనారాయణ, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు తదితరులు వైద్యశా లకు వెళ్ళి క్షతగాత్రులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

పెదనందిపాడు, ఏప్రిల్, 22: గుంటూరు పర్చూరు రహదారిలోని వరగాని వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ప్రత్తిపాడు మండలం వంగిపురం గ్రామానికి చెందిన వి. విమలబాబు వరగానికి ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వాహనం ఢీకొట్టింది. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా ఎస్‌ఐ రాజ్‌కుమార్ అక్కడకు చేరుకొని క్షతగాత్రుడిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

తుమ్మకోటలో వివాహిత దారుణ హత్య

రెంటచింతల, ఏప్రిల్ 22: మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఓ వివాహిత దారుణ హత్యకు గురైన ఘటన సోమవారం వేకువ జామున జరిగింది. కారంపూడి సీఐ బి.చినమల్లయ్య, ఎస్‌ఐ కేవీ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ప్రకారం.. ఆదివారం తుమ్మకోటలో విఘ్నేశ్వరుని ఆలయ ప్రతిష్టతో పాటు బంధువుల ఇంట వివాహ వేడుకలకు కుంకలకుంట్ల భారతి (43) తన కుమారుడు మధు ప్రశాంత్, కూతురు లక్ష్మీ ప్రసన్నతో కలిసి నరసరావుపేట నుంచి వచ్చింది. భర్త శివప్రసాద్ నరసరావుపేటలోనే ఇతర వేడుకకు వెళ్లారు. అర్థరాత్రి ఒంటి గంట వరకు భోజనాలు వడ్డించారు. రెండు గంటల సమయంలో ఆరు బయట నిద్రకు ఉపక్రమించగా పిల్లలు మాత్రం వేరే గదిలో పడుకున్నారు. తెల్లవారుజామున లేచి చూడగా భారతి తల ఛిద్రమై విగత జీవిగా పడివుంది. సమీపంలో వ్యవసాయ పనులకు ఉపయోగించే మేడి కర్రతో తీవ్రంగా కొట్టగా దిండంతా రక్తంతో తడిసి పోయింది. సంఘటనా స్థలాన్ని గురజాల డీఎస్పీ పల్లపురాజు పరిశీలించారు. క్లూస్ టీం,డాగ్ స్క్వాడ్‌లు రంగ ప్రవేశం చేశాయి. కుమారుడు మధు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

93,891 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 95,448 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 93,891 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 60,589 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16500
నెంబరు. 5	9000	11500
273	12000	13500
341	8500	16000
4884	11000	13500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	8000	13500
తెల్లకాయలు	5000	11000



వినుకొండలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు, జీవీ ఆంజనేయులు

కూటమి అభ్యర్థులకే బీసీల మద్దతు

- ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నరసరావుపేట టౌన్, వినుకొండ, ఏప్రిల్ 22: భావితరాల భవిష్యత్ కోసం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ఇస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. సోమవారం నరసరావుపేట, వినుకొండలో కేసన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేవలం సంక్షేమమే కాకుండా అభివృద్ధి జరగాలన్నారు. రాజధాని లేని అనాథ రాష్ట్రంగా మిగిలిపోయిందన్నారు. రాష్ట్రంలో బీసీలపై అత్యాచారాలు, దాడులు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఐదేళ్ళుగా జరుగుతున్న వైసీపీ అరాచకాలు చూస్తూ బీసీ సంక్షేమ సంఘం కూటమి అభ్యర్థులకు మద్దతు పలుకుతున్నారని అన్నారు. ఈ అవినీతి, దుర్మార్గ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. రాష్ట్రం మొత్తం మీద 3వేల బీసీల మీద దాడులు జరిగాయాని, పల్నాడు జిల్లాలో 26 మందిని హత్యచేశారని అన్నారు. నరసరావుపేట పట్టణంలో వరవకట్టకు చెందిన ఇబ్రహీం అనే ముస్లిం వ్యక్తిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కనుసన్నలో హత్యచేశారని అన్నారు. అలవాలలో వెన్నా బాలకోటిరెడ్డిని హత్యచేశారని అన్నారు.

వినుకొండలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే బీసీలకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని స్పష్టంగా చెప్పారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బీసీ డిక్లరేషన్‌లో పెట్టిన అన్నింటిని అమలు చేయించుకోవాలంటే కూటమిని గెలిపించుకోవాలన్నారు. ఆయా సమావేశాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్, బాదుగున్నల శ్రీను, తన్నీరు ఆంజనేయులు, నాగమల్లేశ్వరరావు, న్యాయవాది సైదారావు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈతకు దిగి ముగ్గురు యువకుల మృతి

- తుర్లపాడు మేజరు కాలువ వద్ద ఘటన
- మృతులు ములకలూరువాసులు

నాదెండ్ల / నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 22: మండలంలో ప్రవహిస్తున్న తుర్లపాడు మేజరు కాలువలో ఈతకు దిగి ముగ్గురు యువకులు మృతి చెందారు. కాలువ పక్కనే ఉన్న రోడ్డుపై మోటారు బైక్, చెప్పులు, దుస్తులను గుర్తించటంతో పాటు కాలువలో తేలాడుతున్న మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించటంతో ఈవిషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ ఉన్న వస్తువులు ప్రకారం మృతదిచెందిన ముగ్గురు నరసరావుపేట మండలంలోని ములకలూరు గ్రామస్తులుగా గుర్తించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములకలూరు గ్రామానికి చెందిన చలమల రాజు(20), గేరా పురుషోత్తం(20), బోరుగడ్డ ఆకాష్‌లు(21)లు ఒకే మోటారు సైకిల్‌పై ఆదివారం ఎండుగుంపాలెం గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో కనపర్రు - సాతులూరు గ్రామాల మధ్య తుర్లపాడు మేజరు కాలువలో ఈతకు దిగారు. ఈత కొడుతూ ముగ్గురు గల్లంతయ్యారు. సోమవారం నీటి ప్రవాహం తగ్గటంతో తేలి యాడటంతో ఒక మృతదేహాన్ని గుర్తించారు. చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ బలరామిరెడ్డి ఆధ్వర్యంలో మిగిలిన రెండు మృతదేహాలను కాలువలో నుంచి వెలికి తీశారు. రాజు సెక్యూరిటీ గార్డుగా, ఆకాష్ కార్పెంటర్‌గా పనిచేస్తుండగా పురుషోత్తం ఇంటర్ పూర్తిచేశాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు అవివాహితులు కాగా.. స్నేహితులు కూడా కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మరోసారి మోసపోయేది లేదు

- 1588వ రోజుకు చేరుకున్న ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, ఏప్రిల్ 22: అధికారంలోకి రాక ముందు నుండే సీఎం జగన్ రెడ్డి అమరావతి రాజధానిపై కక్షపెంచుకున్నాడని 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్,మూడు రాజధానులొద్దు అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1588వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పైకి మాత్రం అమరావతిని స్వాగతిస్తున్నాను.. విజయవాడ గుంటూరు మధ్య 30వేల ఎకరాలు రాజధానికి అవసరమవుతుందని చెప్పిన జగన్‌రెడ్డి సీఎంగా అందలం ఎక్కగానే అమరావతిని నాశనం చేయటమే ధ్యేయంగా పెట్టుకున్నాడన్నారు. అమరావతితో పాటు రాష్ట్రాభివృద్ధిని కూడా కుంటు పరిచిన జగన్‌రెడ్డిని ఇంటికి పంపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు.



అత్యధిక మార్కులు సాధించిన దీపికాశ్రీ, విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

నిరంతర పర్యవేక్షణతోనే అత్యున్నత ఫలితాలు

- భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య),ఏప్రిల్22: విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంతో పాటు నిరంతర పర్యవేక్షణ కారణంగా భాష్యం విద్యాసంస్థల్లో అత్యున్నత ఫలితాలు సాధ్యం అయ్యాయని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ వెల్లడించారు. పదిలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన సోమవారం గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాల విదార్థిని జి.దీపికాశ్రీ 597లతో అగ్రస్థానంలో నిచినట్లు తెలిపారు. ఇంకా కె.వెంకట సాయిభావన 596, వైషరీనా 596 మార్కులు సాధించారని వివరించారు. తమ విద్యార్థిని ఎస్.గాయత్రి 595, కె.లక్ష్మీహంసిని 595, ఎస్.ఆశ్రిత 596 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. కాగా తమ విద్యార్థులు 590 పైగా మార్కులను 90మంది, 580 పైగా 588, 670 ఆ పైగా 1299, 550పైగా మార్కులు 2,809 మంది, 500 ఆ పైగా మార్కులు 5,783 మంది సాధించారన్నారు. ఇక గణితంలో 100కు 100 సాధించిన విద్యార్థులు 1,113 మంది, 95 పైగా సాధించిన వారు 3627 మంది, 90 పైగా సాధించిన వారు 5103 మంది ఉన్నారని వెల్లడించారు. అదే విధంగా సైన్స్‌లో 100కు 100 సాధించిన విద్యార్థులు 251 మంది, 95పైగా మార్కులు 2117 మంది, 90 పైగా 4016 మంది సాధించారని వివరించారు. విద్యార్థులను చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు తదితరులు అభినందించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ


మాట్లాడుతున్న నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 22 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఈ విషయమై సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి అక్కడ నుంచి ప్రదర్శనగా ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం, చందోలు, రెడ్డిపాలెం, బిడారుదిబ్బ, బుద్ధాం, కర్లపాలెం, నందిరాజుతోట నుంచి బైపాస్ మీదగా ఇంజనీరింగ్ కాలేజి, ధరివాదకొత్తపాలెం, శ్రీనివాస థియేటర్, గడియారస్తంభం సెంటర్‌మీదగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయానికి వచ్చి నామినేషన్ దాఖలు చేయటం జరుగుతుందన్నారు. కావున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 22 : ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ మంగళవారం నామినేషన్ సందర్భంగా అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి సంయుక్తంగా తెలిపారు. నామినేషన్‌కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

నిష్పక్షపాతంగా ఓటు వేయాలి : కలెక్టర్



స్టై ఓటు లింజ్ స్టై హైట్ బెలూన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 22 : ప్రజాస్వామ్యంలో జాతి, కుల, మతాలకు అతీతంగా ఎన్నికల ప్రాభవాన్ని నిలబెట్టేలా నిష్పక్షపాతంగా ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. స్వీప్ (ఓటుహక్కు అవగాహన కార్యక్రమం) సోమవారం బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఓటర్లను చైతన్య పరిచేందుకు ఈవీఎం యంత్రం నమూనాతో ప్రత్యేకంగా రూపొందించిన ఓటరు అవేర్నెస్ ఎలక్షన్ ఎయిర్‌బెలూన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఓటు హక్కుల విలువలను చాటి చెప్పేలా గాలిలోకి ఎగిరే బెలూన్‌ను ఆవిష్కరించిన ఆయన అక్కడ ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలి సంతకం చేసి ప్రారంభించారు. దేశ పౌరులమైన మనందరికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నిర్భయంగా సద్వినియోగం చేసుకుంటామని ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు మన భవిష్యత్తును మార్చేస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవటంలో ఎలాంటి ప్రలోభాలకు గురికారాదన్నారు. ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి తాము ఓటు వేసేలా చైతన్యం రావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్ సత్తిబాబు, స్వీప్ జిల్లా నోడల్ అధికారి వై.పిచ్చిరెడ్డి, ఐటి నోడల్ ఆఫీసర్ విష్ణు, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమర్ధ మొబైల్ యాప్ ప్రారంభించిన ఎస్పీ వకుల్ జిందాల్


యాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ విఠలేశ్వర్ తదితరులు

బాపట్ల, ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్మార్ట్ అండ్ క్విక్ పోలీసింగ్ కోసం సమర్ధ మొబైల్ యాప్ రూపొందించటం జరిగిందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం యాప్‌ను ప్రారంభించిన ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లా పోలీసు బలగాలు మొత్తం లోకేషన్‌లు ఎప్పటికప్పుడు గూగుల్ మ్యాప్ ద్వారా ట్రాకింగ్ చేయబడతాయన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తితే అక్కడ విధులు నిర్వహించే పోలీసు అధికారి యాప్‌లోనే ఎస్‌వోఎస్ బటన్ క్లిక్ చేయాలన్నారు. దీని ద్వారా కంట్రోల్ రూమ్‌కు నోటిఫికేషన్ వెళ్లి మ్యాప్‌లో సదరు అధికారిని ఎరుపురంగులో సూచిస్తారన్నారు. తద్వారా అధికార పరిధిలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తాయని గుర్తించి దగ్గరలో ఉన్న మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ బృందాలు ఆ ప్రదేశానికి చేరుకుంటాయన్నారు. ఈ యాప్ ద్వారా పోలీసు అధికారులు డైరెక్ట్‌గా కాల్ చేయవచ్చు అని చెప్పారు. ఒక్క నోటిఫికేషన్ ద్వారా జిల్లాలో ఉన్న 2000 మంది పోలీసులకు ఒకేసారి ఆదేశాలు జారీ చేయవచ్చు అన్నారు. ఎన్నికల నియమావళికి సంబంధించిన సమాచారం, ట్రైనింగ్ మెటిరియల్ యాప్‌లో పొందుపర్చబడి జిల్లాలో ఉన్న 2 వేల మంది పోలీసులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్నికలకు సంబంధించి వచ్చే పిటీషన్‌లను సంబంధిత పోలీసు అధికారులకు యాప్ ద్వారా పంపి ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.మల్లికార్జునరావు, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.బాలమురళీకృష్ణ, ఐటీ కోర్ ఎస్సై నాయుబ్ రసూల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలకు ఉత్తమ ఫలితాలు

కొల్లూరు, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థిని విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఉత్తీర్ణత శాతం 94.7 గా నమోదు అయ్యింది. బాలురోన్నత పాఠశాలలో 70 శాతం నమోదు కాగా అనంతవరం పాఠశాలలో ఉత్తీర్ణతశాతం 66, దోనేపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణత శాతం 81గా నమోదు అయ్యింది. ఈ పాఠశాల విద్యార్థిని వాగోలు హిమశ్రీ 573 మార్కులు సాధించింది. విద్యార్థిని విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

● భట్టిప్రోలు, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని విద్యార్థులు 92.95 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవోలు లాజరు, దేవరాజ్‌లు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి పెసర్లంక హైస్కూలుకు చెందిన కె.రాహుల్ మొదటిస్థానంలో నిలవగా, పెసర్లంక హైస్కూలుకు చెందిన కీర్తన ద్వితీయ స్థానంలో నిలిచారు. ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను ఎంఈవోలు అభినందించారు.

● అమృతలూరు, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో అమృతలూరు మండల ఉత్తీర్ణత 78 శాతం వచ్చినట్లు ఎంఈవో రమేష్ బాబు సోమవారం తెలిపారు. మండలంలోని మోపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఓలేటి హారిక ప్రథమ స్థానంలో నిలిచింది. అమృతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75 శాతం, మూల్పూరు 61, పెదపూడి, 72, మోపర్రు 96, తురుమెళ్ళ, 86, గోవాడ 75, ఇంటూరు, 67శాతం, ప్యాపర్రు, 91, కూచిపూడిలోని ఎస్‌కేవీ హైస్కూల్ 93శాతం ఉత్తీర్ణత సాధించాయి. కాగా బాలికల ఉత్తీర్ణత శాతం 84 ఉండగా బాలురు 71 శాతంగా ఉంది.

● వేమూరు, ఏప్రిల్ 22 : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో వేమూరు మండలం విద్యార్థులు 71.9శాతం ఉత్తీర్ణత చెందారు. ఆరు పాఠశాలల పరిధిలో 292 మంది పరీక్షలకు హాజరు కాగా 210మంది ఉత్తీర్ణులయ్యారు. చావలి పాఠశాలకు చెందిన రూపా సరస్వతి 567మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. పెరవలి ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య 561మార్కులతో ద్వితీయ స్థానాన్ని, జంపని పాఠశాలకు చెందిన దున్న సన్నీ 558మార్కులతో మండల స్థాయిలో తృతీయ స్థానాన్ని సాధించారు. జంపని పాఠశాలకు చెందిన 96 మందిలో 73 మంది (76 శాతం) ఉత్తీర్ణులయ్యారు. కుచ్చెళ్ళపాడు పాఠశాలకు చెందిన 23మందిలో 19మంది (82శాతం) ఉత్తీర్ణులయ్యా రు. వరహాపురం పాఠశాలకు చెందిన 11మందిలో 8మంది (73 శా తం), పెరవలి పాఠశాలలో 45మందిలో 38 మంది (84శాతం), చావలి పాఠశాలకు చెందిన 41మందిలో 39మంది (95శాతం), వేమూరు పాఠశాలకు చెందిన 76మందిలో 33మంది (43శాతం) ఉత్తీర్ణులయ్యారు.

● చుండూరు ఏప్రిల్ 22 : పది ఫలితాల్లో మోదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 78.58 శాతం, చుండూరు జిల్లా పరిషత్ హైస్కూల్ 74.42శాతం, చినపరిమి హైస్కూల్ 69.23శాతం, వేటపాలెం స్కూల్ 65.71శాతం, యడ్లపల్లి హైస్కూల్ 65.35శాతం, మండూరు హైస్కూల్ 52.63శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వలివేరు సెయింట్ ఆన్స్ స్కూల్‌కు చెందిన పద్మావతి 586మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, చినపరిమి హైస్కూల్‌కు చెందిన బిందు సాయిశ్రీ 569 మార్కులతో ద్వితీయ స్థానం, మోదుకూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన పూజిత 566 మార్కులతో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. మండలం మొత్తం మీద 70.26శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు.

● పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 22 : 2023-2024 సంవత్సరానికి సంబంధించి మండల వ్యాప్తంగా జరిగిన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో చందోలు నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీలు మండలస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవశం చేసుకున్నట్లు మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్ష ఫలితాలలో బాలురు, బాలికలు ముందంజలో ఉన్నారని తెలిపారు.

మైనార్టీ, బీసీలకు అండగా ఉండేది టీడీపీనే

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్


ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు గజమాలను వేస్తున్న అభిమానులు

చెరుకుపల్లి, ఏప్రిల్ 22: మైనార్టీ, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి వారికి ఉపయోగపడింది టీడీపీయేనని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవా రం కనగాల, ఆరేపల్లి, తూర్పుపాలెం, పంచాయతీలలోని గ్రామాల్లో రోడ్‌షో కార్యక్రమాన్ని నిర్వహించారు. కనగాల గ్రామంలో ఎమ్మెల్యే అనగానికి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు, కూలీలకు ఉపాధి కల్పనను అందించింది టీడీపీ అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గ్రామాల్లోని ప్రజలు బలపరిచి గెలిపించాలని ఆయన ప్రజ లను కోరారు. గ్రామాల్లోని రహదారులను అభివృద్ధి పర్చాలంటే టీడీపీ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. తాగు, సాగు నీరు అందించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వైసీపీ పాలకులు గ్రామాల్లోని మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రానికి సుపరిపాలన కావాలంటే ఎన్‌డీఏ కూటమికి విజయం చేకూర్చాలని ప్రతి ఒక్కరూ ఎన్‌డీఏ బలపరిచిన అభ్యర్థులకు ఓటును వేసి ఆశీర్వదించాలన్నారు. వైసీపీ నాయకుల కల్లబొల్లి మాటలు విని వైసీపీకి ఓటు వేసి మోసపోవద్దని ప్రజలకు తెలిపారు. ఉద్యోగ కల్పనలో వైసీపీ యువతను మోసం చేసిందని వివరించారు. ముస్లింలకు రంజాన్ తోఫాను అందించటంలో మోసం చేసిందన్నారు. జగన్ చెప్పేవన్నీ కట్టు కథలేనని రాష్ట్రానికి ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసింది ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. రైతు సంక్షేమం కోసం చంద్రబాబు ప్రభుత్వంలో ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు ఆర్థిక సాయం అందించే దిశగా మ్యానిఫెస్టోను విడుదల చేశారన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసే దాకా యువత నిరంతరం ప్రచారాన్ని ముమ్మరం చేయ్యాలని ఇంటింటికి వెళ్ళి టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని యువతను కోరారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలం టే ఎన్డీయే కూటమిని ప్రతి ఒక్కరూ బలపర్చాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఉయ్యూరు వెంకట శివ, మొఖమాటం రాధాకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు పూషడపు కుమారస్వామి, నర్రా సుబ్బయ్య, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, దివి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, ఏను గుల కోటేశ్వరరావు, ఎల్లిల రవికిరణ్, ఆలా రాధాకృష్ణ, షేక్ కరిముల్లా, రాము, గోగినేని వసుధ, ఊచా కిరణ్, ఊచా వీర్లంకయ్య, మొగలిపువ్వు సుబ్రహ్మణ్యం, పస్నీరు శ్రీకాంత్, జనసేన నాయకు లు మత్తి భాస్కరావు, మండల అధ్యక్షుడు దూళ్ళ సురేష్, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుషోలో భారీగా పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

టీడీపీలో భారీగా చేరిన వైసీపీ నాయకులు


టీడీపీలో చేరిన నల్లమోతువారిపాలెం వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 22 : కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ యువనాయకులు బీసాబత్తిన గోపి ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. బాపట్లలో వారికి టీడీపీ, జనసేన,బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేంద్రవర్మ నాయకత్వంలో బాపట్ల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని బలంగా నమ్ముతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బేతపూడియువత

బాపట్ల మండలం బేతపూడి గ్రామానికి చెందిన రెడ్డియువత 13 మంది సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తామంతా తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు నాయుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రావి రాజగోపాల్‌రెడ్డి, కోట గన్‌సాయిబ్‌రెడ్డి, కోట పుల్లారెడ్డి, నాయుడు రమేష్‌రెడ్డి, కోట గాంధీరెడ్డి, భోగిరెడ్డి తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీలో చేరిన ఒకటవ వార్డు ప్రజలు

పట్టణంలోని 1వ వార్డుకు చెందిన 15 మంది నాయకులు బీసీ సంక్షేమ సంఘ మహిళా నాయకురాలు కంకణాల బాలమ్మ ఆధ్వర్యంలో సోమవారం తెలుగుదేశంపార్టీలో చేరారు. వారికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలుగుదేశంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వారు అన్నారు.

టీడీపీలో చేరిన మాజీ కౌన్సిలర్ దేవసహాయం

పట్టణంలోని 29వ వార్డు మాజీ కౌన్సిలర్ చింతా దేవసహాయం సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయనకు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ కండువా కప్పి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందని నరేంద్రవర్మ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ఫరీద్‌మస్తాన్, మందపాటి ఆంధ్రేయ, బూర్లె రామసుబ్బారావు, మాజీ కౌన్సిలర్‌లు పులివాసు, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.


మాజీ కౌన్సిలర్ చింతా దేవసహాయంకు కండువా కప్పి పార్టీలో చేర్చుకుంటున్న నరేంద్రవర్మ

పీసీసీ చీఫ్ షర్మిల సభను జయప్రదం చేయాలి

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు

బాపట్ల, ఏప్రిల్ 22 : బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం మండలంలో మంగళవారం జరిగే పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు కోరారు. పార్టీశ్రేణులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అంజిబాబు మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రెండురోజుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు, సీనియర్ నాయకులు ఎస్‌వీఆర్‌కుమార్, చింతాబాబురావు, మహిళా అధ్యక్షురాలు దుండు రేణుక, కోన జయశాంతి, షేక్ మజురున్నీసా పాల్గొన్నారు.

బాపట్ల సత్తాచాటిన రామన్ సుబ్బారావు

బాపట్ల, ఏప్రిల్ 22 : ఇంగ్లాండ్ క్రికెట్ ఆటగాడిగా బాపట్ల సత్తాను రామన్ సుబ్బారావు చాటారని ఫోరంఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు పేర్కొన్నారు. బాపట్ల మండలం జమ్ములపాలెం గ్రామానికి చెందిన సుబ్బారావు ఇంగ్లాండ్ దేశం తరుపున 14 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి తొలి టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ చేశారన్నారు. అటువంటి గొప్ప క్రికెటర్ ఈనెల 17వ తేదీన తన 92వ ఏట ఇంగ్లాండ్‌లో మరణించటం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహన్, హేతువాద సంఘనాయకులు కరణం రవీంధ్ర, న్యూస్‌పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీకి రాజీనామా చేసిన పట్టణ అధ్యక్షుడు రవికిరణ్


నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరిన రవికిరణ్ తదితరులు

చెరుకుపల్లి, ఏప్రిల్ 22: వైసీపీ చెరుకుపల్లి పట్టణ అధ్యక్షుడు యెల్లల రవికిరణ్ ఆపార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్ సమక్షంలో సోమవారం జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ వైసీపీ స్థాపించిన నాటి నుంచి పార్టీ కోసం పని చేశానని పార్టీ కార్యక్రమాలను గ్రామంలో తనకు తెలియకుండా చేస్తున్నారని విమర్శించారు. పార్టీ కోసం పనిచేసినా చిన్న చూపు చూశారని విసుగు చెంది జనసేనలో చేరామన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు మత్తి భాస్కరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు దూళ్ళ సురేష్, మొఖమాటం పృథ్వీ, వివిధ గ్రామాల నుంచి జనసేనలో చేరిన నాయకులు ఉన్నారు.

అప్పుల బాధ తాళలేక మహిళ ఆత్మహత్య

బాపట్ల, ఏప్రిల్ 22 : అప్పుల బాధ తాళలేక పండ్ల వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ ఎస్సై రజాక్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్లలోని భీమావారిపాలేనికి చెందిన విస్సా సుజాత (38) పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. అప్పుల భారం ఎక్కువ అవడటంతో ఆదివారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానిక రైల్వేక్వార్టర్స్ సమీపంలో పడి ఉన్న ఆమెను స్థానికులు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈమేరకు మృతురాలు తల్లి మేళం పార్వతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్ దాఖలు

బాపట్ల, ఏప్రిల్ 22 : బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థులుగా సోమవారం ముగ్గురు నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. జైభీమ్‌రావ్ భారత్‌పార్టీ అభ్యర్థిగా బడుగు విజయభరత్, స్వతంత్ర అభ్యర్థులుగా ఉప్పాల మురళీ, మరుప్రోలు చెన్నకేశవరెడ్డిలు నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గానికి నవతరం పార్టీ అభ్యర్థిగా నల్లమల్ల తిరుపతిరావు, జైభీమ్‌రావు భారత్‌పార్టీ అభ్యర్థిగా పర్రె కోటయ్య నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషాకు అందజేశారు.

ఐదు నామినేషన్లు దాఖలు

రేపల్లె, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం వివిధ పార్టీల నుంచి ఐదు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్ తెలిపారు. వైసీపీ తరపున డాక్టర్ ఈవూరి గణేష్ రెండు నామినేషన్లు దాఖలు చెయ్యగా వారి కుమారుడు డమ్మీగా డాక్టర్ ఈవూరి సృజన్ ఉపనామినేషన్ దాఖలు చేశారు. యూసీపీ ఆర్‌ఐఎంఎల్ ఇండిపెండింట్ అభ్యర్థిగా కొక్కిలిగడ్డ రాంబాబు నామినేషన్ దాఖలు చేశారన్నారు. పిరమిడ్ పార్టీ తరపున బెల్లంకొండ సుబ్బారావు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఒకరు నామినేషన్‌ను దాఖలు చేశారు.

బీఫారం లేకుండానే వైసీపీ అభ్యర్థి నామినేషన్

వేమూరు, ఏప్రిల్ 22 : వేమూరు అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సోమవారం ఒక్క సెట్టు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వసంతరాయుడుకు సమర్పించారు. బీఫారం లేకుండానే నామినేషన్ పత్రాలు అందించారు. ఈ నెల 25న బిఫారంతో మరోమారు నామినేషన్ వేస్తామని విలేకర్లకు తెలిపారు. అశోక్‌బాబు కుమారుడు గౌతమ్ కూడా ఒక్క సెట్టు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. వేమూరు అసెంబ్లీకి జై భారత్ జాతీయ పార్టీ తరపున దూరు భాగ్యరాజు నామినేషన్ వేశారు. వేమూరు అసెంబ్లీ స్థానానికి మొత్తం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో తెలిపారు.

ఎన్నికల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

బాపట్ల,ఏప్రిల్ 22 : ఎన్నికల నేపథ్యంలో జిల్లా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 24 గంటలు కేంద్రాలు పని చేస్తాయన్నారు. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించటానికి యంత్రాంగం నిరంతరం పని చేస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రజలు సమస్యల పరిష్కారం, ఫిర్యాదుల కొరకు మీడియా సెంటర్ 08643-297808, వెబ్ కాస్టింగ్ 08643-297811, సి-విజన్ 08643-297804, 1950 కాల్ సెంటర్ 08643-297802, హెల్ప్‌డెస్క్ 08643-297812ను సంప్రదించవచ్చన్నారు.

కొల్లూరులో పట్టపగలే ఓ గృహంలో చోరీ

కొల్లూరు, ఏప్రిల్ 22 : పట్టపగలు ఓ గృహంలో ఓ ఆగంతకు డు చోరీకి పాల్పడిన ఘటన కొల్లూరులో జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరులోని మసీదు సమీపంలో నర్రా శివరామప్రసాద్ గృహంలో మధ్యాహ్నం ఓ ఆగంతకుడు చొరబడి చేతికి అందిన వస్తువులను తస్కరించుకుపోయాడు. చోరీలో రూ.30 వేలు విలువ కలిగిన వాచ్‌తో పాటు మరికొంత నగదు, మరికొన్ని వస్తువులు ఉన్నట్లు బాధితులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మోపిదేవి శ్రీనివాసరావు నియామకం

రేపల్లె, ఏప్రిల్ 22: కాంగ్రెస్‌పార్టీ రేపల్లె నియోజకవర్గ అభ్యర్థిగా మోపిదేవి శ్రీనివాసరావును అధిష్ఠానం ఎంపిక చేసి సోమవారం ప్రకటించారు. స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో అభ్యర్థి మోపిదేవి శ్రీనివాసరావు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇప్పటికి మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశానని.. అధిష్ఠానం తనను రేపల్లె అభ్యర్థిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.


గుమ్మడి కాయతో ఆనందబాబుకు దిష్టి తీస్తున్న మహిళ

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

● కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 22: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని అప్పులతో సంక్షోభాన్ని సృష్టించి అభివృద్ధికి ఆమ డదూరం చేశారని వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు విమర్శించారు. సోమవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నాలుగోసారి చంద్రబాబునాయుడు తనకు ఈ అవకాశం ఇచ్చారని, టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతుతో పోటీ చేస్తున్న తనను ఆదరించాలని కోరారు. కేవలం పథకాల సాకుగా చూపి లక్షల కోట్లు అప్పులు తెచ్చి అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ అవినీతి సొమ్మును, కేసులను కప్పిపుచ్చుకునేందుకు ఎన్నికల్లో ఏదో విధంగా గెలవాలనే లక్ష్యంతో అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ప్రజలు తెలుసుకోలేకపోతే రాష్ట్రం మరింత పతనం కావడం ఖాయమని అన్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగి ఐదేళ్ళు అయినా ముఖ్యమంత్రి పదవిలో ఉన్న జగన్ హంతకునికి జైలు శిక్ష వేయలేకపోవడానికి కారణం ఏమిటలో ప్రజలకు తెలిసిందేనన్నారు. కోడికత్తి, గులకరాయి డ్రామాలను రక్తికట్టించలేక నానా పాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్ మాట్లాడు తూ ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబు విజయం కోసం జనసేన పార్టీ నియోజకవర్గంలో విశేషంగా కృషి చేస్తుందన్నారు. అలాగే బాపట్ల ఎంపీ అభ్యర్థి విజయం కోసం కూడా పార్టీల శ్రేణులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆనందబాబు నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధి నుంచి విశేష సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు అభినందనలు తెలిపారు.


వేమూరులో ఆనందబాబు నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న జన సందోహం

భారీ ర్యాలీగా తరలివెళ్లిన ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 22 : వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు సోమవారం నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి వసంతరాయుడుకు సమర్పించారు. రెండు సెట్ల నామినేషన్ పత్రాలను వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి అందజేశారు. ఒక నామినేషన్‌ను అమర్తలూరు మాజీ ఎంపీపీ గొట్టిపాటి పూర్ణకుమారి ప్రతిపాదించగా, మరో నామినేషన్‌ను జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్ ప్రతిపాదించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో పాటు, హార్వెస్టు ఇండియా ఛైర్మన్ కత్తెర సురేష్‌కుమార్ పత్రాలను అందజేసిన వారిలో ఉన్నారు.


ఆనందబాబు నామినేషన్ కార్యక్రమానికి తరలి వెళుతున్న టీడీపీ, జనసేన శ్రేణులు

ఆనందబాబు నామినేషన్‌కు తరలివెళ్లిన టీడీపీ, జనసేన శ్రేణులు

కొల్లూరు, ఏప్రిల్ 22 : మాజీ మంత్రి, టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు నామినేషన్ కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కొల్లూరులోని కాలేజీ రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం గ్రామాల నుంచి టీడీపీ, జనసేన శ్రేణులతో పాటు మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడ నుంచి ర్యాలీగా వేమూరు ఎన్టీఆర్ పురవేదిక వద్దకు మిత్రపక్షాలతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. అనంతరం మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్ తన అనుచరులతో ర్యాలీగా వేమూరు వెళ్లారు.

24న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ నామినేషన్

రేపల్లె, ఏప్రిల్ 22: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 24వ తేదీన టీడీపీ అభ్యర్థిగా నామినేషన్‌లు దాఖలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం నియోజకవర్గంలోని ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీఫామ్ అందివ్వడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 24న నామినేషన్‌కు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించారని అభివృద్ధి చేయకపోగా రాష్ట్రాన్ని అన్ని విధాలా సర్వనాశనం చేశారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం రాష్ట్ర, మండల, గ్రామస్థాయి నాయకులు ఐక్యంగా పని చేయాలని సూచించారు. చిన్న లోపాలుంటే ఒకే కుటుంబంలా సర్దుకుపోయి టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా కార్యదర్శి తాతా ఏడుకొండలు, నాలుగు మండలాల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

నగరం వైసీపీ జడ్పీటీసీ టీడీపీలోకి చేరిక


నగరం వైసీపీ జడ్పీటీసీ మాన్యం నాగమణికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 22: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్డీయే కూటమితోనే సాధ్యమని వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు నచ్చక నియోజకవర్గంలో భారీ స్థాయిలో వైసీపీ నాయకు లు, టీడీపీలోకి చేరుతున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం నగరం మండలం వైసీపీ జడ్పీటీసీ అయిన మాన్యం నాగమణికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ కండు వా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని పార్టీకి అండగా ఉంటే మీకు సముచిత స్థానం కల్పిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, నగరం మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, పిన్నిబోయిన చింతారావు, విచారపు కుటుంబరావు, ఆళ్ల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


పెమ్మసాని నామినేషన్ ర్యాలీలో కోలాటం ఆడుతున్న మహిళలు

నాయకా.. ఏమి నీ అలక..!



- పార్టీకి దూరంగా ఉంటున్న నాయకులపై నేతల దృష్టి
- ట్రబుల్ షూటర్స్‌ను రంగంలోకి దింపుతున్న పార్టీలు
- నయానో భయానో ఒప్పించడానికి ముమ్మరంగా ప్రయత్నాలు
- గతాన్ని గుర్తు చేస్తూ బెట్టు చేస్తున్న నాయికాగణం

బాపట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రకరకాల కారణాలతో పార్టీకి దూరంగా ఉంటున్నవారిని నేతలు ఇన్ని రోజులూ లైట్ తీసుకున్నారు. కానీ ఎన్నికల సమయం కావడంతో వారి అలకలపై ప్రత్యేకంగా రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. వారిని శాంతింపజేసి తిరిగి పార్టీకోసం పనిచేసే విధంగా వారిని ఒప్పించడానికి నిష్ణాతులైన ట్రబుల్ షూటర్స్‌ను నేతలు రంగంలోకి దింపారు. వీరి అండతో వారి అలకలకు విరుగుడు కనుక్కునే కార్యక్రమాన్ని నేతలు ముమ్మరం చేశారు. తృణమో, పణమో ఇచ్చయినా సరే వారిని మళ్లీ పార్టీలో యాక్టివ్ అయ్యేలా చూసి పదోపరకో ఓట్లు పంట పండించుకోవాలి.. ఇదే నేతల తక్షణ కర్తవ్యం.

అప్పుడు పట్టించుకోలేదు...

పార్టీ పరిస్థితిపై నెత్తీనోరు కొట్టుకుని చెప్పినా అప్పుడు వినలేదు. ఇప్పుడు ఎందుకు వచ్చారు. అలకబూనిన ఓ నేత మాటలివి. అప్పుడంటే ఆయన మాటలతో విభేదించారు కానీ ఇప్పుడు ఆ అవకాశం లేదాయే. సదరు నేత చెప్పిన ప్రతి మాటను స్కూల్‌కు వెళ్లే పిల్లాడిలా శ్రద్ధతో ఆలకిస్తున్నారు నేతలు. ఎందుకంటే వచ్చిన పనికావడం ముఖ్యం కనుక. అప్పుడంటే ఎన్నికలు లేవు కనుక పార్టీకి దూరంగా ఉంటానని అలకబూనినా పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడంటే ఎన్నికలు తప్పదు మరీ.

ట్రబుల్ షూటర్స్‌కు డిమాండ్...

ఓ ఊరులోనో, కాలనీలోనే పెద్దమనిషి తరహాలో ట్రబుల్ షూటర్స్‌గా కొంతమంది కీర్తి గడించి ఉంటారు. వీరి అవసరం ఎన్నికల వేళ నేతలకు వచ్చి పడింది. అలకలు, పట్టుదలతో పార్టీకి దూరంగా ఉంటున్న వారిపైకి తొలుత ట్రబుల్ షూటర్స్‌నే ప్రయోగిస్తున్నారు. వారితో మాటామంతీ పూర్తయిన తర్వాత కానీ సదరు అగ్రనేత రంగప్రవేశం జరగడం లేదు. నేరుగా నేతే అలకబూనిన వారి దగ్గరకు వెళితే ముఖానే తలుపు వేస్తే ఎన్నికల వేళ సదరు నేతల పరువు ఏం కానూ.. అందుకు మొదట ట్రబుల్ షూటర్స్ ప్రయోగం.. ఆనక కథానాయకుడు ఎంట్రీతో కథ తిరిగి పార్టీ గూటికి చేరుతోంది.

పదవులు మొదలు.. పైకం వరకూ..

అలకబూనిన నేతలను దారికి తెచ్చుకోవడానికి అప్పుడే నామినేటెడ్ పదవుల పందేరంతో పాటు స్థానిక సంస్థల పదవుల పంపకం కూడా జోరుగా సాగుతోంది. అన్నీ పార్టీల్లో ఇదే తంతు. ఇదెలా సాధ్యం గెలిచేది ఒక్కపార్టీనే కదా.. అందరికీ న్యాయం ఎలా జరుగుతుందనే ధర్మసందేహాలు ఎన్నికల వేళ అసలు రాకూడదు.. గెలిచేసినట్లు.. పదవులు వరించినట్లు నేతలు వారికి అరచేతిలో త్రీడీ సినిమా చూపిస్తారు. వారు దానిని నమ్మి అలకపాన్పు వీడి పార్టీ గెలుపుకోసం పనిచేయాల్సిందే. ఫలితాలు వచ్చాక తర్వాత సంగతి.

అవమానాలను నేతల ముందు ఏకరువు...

ఎన్నికలప్పుడు చూసుకోవచ్చులే అనే ధీమాతో నేతాగణం కూడా దురుసుగా మాట్లాడి చాలామందిని పార్టీకి దూరం చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఇప్పుడు గత్యంతరం లేని పరిస్థితుల్లో వారి గడప తొక్కాల్సిన అగత్యం నేతాగణానిది. ఇదే అదనుగా అప్పుడు తమకు ఎదురైన అవమానాన్ని నేతల ఎదురుగానే కడిగిపారేసి తమ ఆక్రోశాన్ని తీర్చేసుకుంటున్నారు అలకబూనిన నేతలు. అంటే అన్నారులేగాని పార్టీలోకి వచ్చి గెలుపు కోసం పని చేస్తే అదే పదివేలు అన్న చందాన నేతలు సర్దుకుపోతున్నారు.

మాకేంటి అనే పంథా కొందరిదీ....

పార్టీపై అభిమానం ఉన్నప్పటికీ దూరం జరిగిన వారు నేతల కొద్దిపాటి బుజ్జగింపు లతోనే ఓ మెట్టు దిగి వెంటనే ప్రచారానిక సై అంటున్నారు. మరి కొంతమంది మా త్రం అలకపాన్పు వీడాలంటే నేతలు కట్నం చదివించాల్సిందే అని పట్టుబడుతున్నారు. అదికూడా మరీ ఎక్కువగా ఉండడంతో నేతలు అవాక్కవుతున్నారు. అలా అని చెప్పి వారి మానాన వారిని అలకలకు వదిలేయలేరు. నయానో భయానో ఒప్పించి మళ్లీ పార్టీ జెండా కప్పి ఓసారి జిందాబాద్ కొట్టించుకుంటేనే నేత మనసు కుదుటపడని పరిస్థితి. ఎందుకంటే ఎన్నికలు సమయం కదా... తప్పదు అలకలు తీర్చాలిందే... అందుకు అవసరమయ్యే నజరానాలు అందించాల్సిందే..!


పెమ్మసాని నామినేషన్ ర్యాలీలో పవన్‌కళ్యాణ్, కృష్ణ, బాలకృష్ణ వేషధారణలో కళాకారులు


పెమ్మసాని, మాధవి నామినేషన్ ర్యాలీలో పూలు జల్లుతున్న డ్రోన్


పెమ్మసాని నామినేషన్ ర్యాలీలో అభిమానులపై పూల వర్షం కురిపిస్తున్న డ్రోన్


పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా మాధవిల నామినేషన్ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు


పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా మాధవి నామినేషన్ ర్యాలీలో ఆకాశంలో ప్యారాగ్లైడ్ చేస్తున్న టీడీపీ అభిమానులు

నామినేషనోత్సవాలు

మండే ఎండలో.. జన హోరు.. జోరు మధ్య సోమవారం కూటమి తరఫున పోటీ చేసే టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కూటమి శ్రేణుల జయజయధ్వానాలు.. టపాకాయలు, తీన్‌మార్ శబ్దాల మధ్య అభ్యర్థులు ర్యాలీలతో ఆయా నియోజకవర్గ కేంద్రాలు హోరెత్తిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు అభ్యర్థులకు ఎక్కడికక్కడ ఘన స్వాగతం పలికి ఆర్‌వో కేంద్రాల వరకు తీసుకెళ్లి నామినేషన్లు దాఖలు చేయించారు. మార్గమధ్యలో మహిళలు దిష్టితీసి అభ్యర్థులకు వీర తిలకాలు దిద్దారు. కళాకారుల ప్రదర్శనలు, మహిళల నృత్యాలు, యువత సందడితో ర్యాలీలు ఆకట్టుకున్నాయి. దారిపొడవునా పార్టీ శ్రేణులు, మహిళలు అభ్యర్థులకు నీరాజనాలు పలికారు. గుంటూరులో లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థిలు మాధవి, నసీర్‌లు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం నామినేషన్లు దాఖలు చేశారు. ప్రత్తిపాడులో బూర్ల రామాంజనేయులు, సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ, గురజాలలో యరపతినేని శ్రీనివాసరావు, వేమూరులో నక్కా ఆనందబాబు, బాపట్ల జిల్లా పర్చూరులో ఏలూరి సాంబశివరావు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు.

- గుంటూరు, ఆంధ్రజ్యోతి


పెమ్మసాని, మాధవి నామినేషన్ ర్యాలీలో విచిత్ర వేషధారణలో కళాకారులు


పెమ్మసాని నామినేషన్‌లో బొమ్మల ఎద్దులతో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ అభిమానులు


సత్తెనపల్లి అసెంబ్లీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ నామినేషన్ ర్యాలీలో తెలంగాణా డప్పు కళాకారులతో కలిసి పాల్గొన్న పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసీ, తెలుగు మహిళలు


పెమ్మసాని, మాధవి నామినేషన్ ర్యాలీలో విచిత్ర వేషధారణలో కళాకారులు


వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న రాజస్థాన్ బ్యాండ్ కళాకారులు


- ఆ ముగ్గురు నేతలు ఎమ్మెల్యే.. ఎంపీగా విజయం సాధించారు
- నరసరావుపేట లోక్‌సభ.. అసెంబ్లీ నుంచి..

కాకలు తీరిన నేతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట నియోజకవర్గం ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ముగ్గురు నేతలు నరసరావుపేట లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల నుంచి పోటీచేసే అవకాశం దక్కించుకున్నారు. ఎమ్మెల్యేగా.. ఎంపీగా గెలుపొందిన ఘనత సాధించారు. కాకలు తీరిన రాజకీయ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి నరసరావుపేట లోక్‌సభ, అసెంబ్లీ రెండింటికీ ఎన్నికయ్యారు. కాసు బ్రహానందరెడ్డి 1967లో జరిగిన ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలు అందజేశారు. 1977, 1980లో జరిగిన ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన కాసు బ్రహ్మానందరెడ్డి ఘన విజయం సాధించారు. వరుసగా మూడవ సారి 1984లో జరిగిన ఎన్నికల్లో పోటీచేసిన ఆయన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాటూరి నారాయణస్వామి చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తదుపరి బ్రహ్మానందరెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఎంపీగా బ్రహానందరెడ్డికి హ్యాట్రిక్ చేజారింది.

1951లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో నరసరావుపేట నియోజకవర్గం నుంచి చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలేనికి చెందిన చాపలమడుగు రామయ్య చౌదరి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఎంపీగా ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.


కాసు బ్రహ్మానందరెడ్డి


చాపలమడుగు రామయ్య చౌదరి


కాసు వెంకట కృష్ణారెడ్డి

కాసు బ్రహ్మానందరెడ్డి వారసుడిగా రాజకీయాల్లో అడుగిడిన కాసు వెంకటకృష్ణారెడ్డి నరసరావుపేట నుంచి ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978లో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన కాసు కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ కాలంలో ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. 1989, 1991లో జరిగిన ఎన్నికల్లో కాసు వెంకటకృష్ణారెడ్డి వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నరసరావుపేట లోక్‌సభ నుంచి పోటీచేసి ఎంపీగా ఎన్నికయ్యారు. 1996లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కోట సైదయ్య చేతిలో పరాజయాన్ని చవిచూసిన ఆయన హ్యాట్రిక్ విజయాన్ని చేజార్చుకున్నారు. 1985, 1999 ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీకి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన కాసు.. కోడెల చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు కాసు వెంకటకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై పలు మంత్రి పదవులను నిర్వహించారు. కాసు కృష్ణారెడ్డి రెండుసార్లు ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా నరసరావుపేట నుంచి గెలు పొందారు.

ఇక్కడి నుంచి రెండు సార్లే ఛాన్స్

నరసరావుపేట లోక్‌సభ నుంచి ఎవరికైనా రెండు సార్లు గెలిచే అవకాశాన్ని ఓటర్లు ఇచ్చారు. హ్యాట్రిక్ బరిలో దిగిన నేతలను ఓడించిన ఘనత ఇక్కడ ఓటర్లది. 1967, 1971 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నరసరావుపేట లోక్‌సభ నుంచి పోటీచేసి అత్యధిక మెజారిటీతో మద్ది సుదర్శనం గెలుపొందారు. ఆయనకు మూడవసారి ఇక్కడి నుంచి పోటీచేసే అవకాశం దక్కలేదు. 1977, 1980 ఎన్నికల్లో పోటీచేసిన కాసు బ్రహ్మానందరెడ్డి విజయం సాధించారు. 1984 మూడవ సారి ఇక్కడ నుంచి పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. అలాగే ఆయన వారసుడు కాసు వెంటకకృష్ణారెడ్డి కూడా 1989, 1991 ఎన్నికల్లో పోటీ చేసి రెండుసార్లు మాత్రమే ఎన్నికయ్యారు. 1996లో హ్యాట్రిక్ బరిలో దిగిన కాసు వెంకట కృష్ణారెడ్డి ఓటమి చెందారు.

మా అభ్యర్థే..

- 2004 ఎన్నికల్లో చిలకలూరిపేటలో విచిత్ర పరిస్థితి
- పార్టీ టికెట్ ఇచ్చి... ఆ అభ్యర్థికి ఓటు వేయవద్దని ప్రచారం

కానీ ఓటెయ్యొద్దు

చిలకలూరిపేట, ఏప్రిల్ 22: ఎన్నికల్లో పోటీచేసే పార్టీ అభ్యర్థిని ప్రకటించారు. బీఫారం కూడా ఇచ్చారు. నామినేషన్ల పర్వం పూర్తయింది. బ్యాలెట్ పేపర్‌లో పార్టీ గుర్తు కేటాయింపు కూడా జరిగింది. అయితే ఆ అభ్యర్థికి మాత్రం ఓటు వేయవద్దంటూ పార్టీ నాయకులే ప్రచారం చేసిన పరిస్థితి. ఇది 2004 ఎన్నికల్లో చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగింది. ఆ ఎన్నికల్లో ఈ అసెంబ్లీ నియోజకవర్గం గుంటూరు పార్లమెంటు పరిధిలో ఉంది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా రాయపాటి సాంబశివరావు పోటీలో ఉన్నారు. చిలకలూరిపేట అసెంబ్లీ కాంగ్రెస్ సీటును రాయపాటి సూచన మేరకు పట్టణానికి చెందిన సీనియర్ కళాకారుడు మల్లాది శివన్నారాయణకు కేటాయించారు. 1978 నుంచి చిలకలూరిపేట కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడుగా ఉండి ఆరుసార్లు అసెంబ్లీకి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన సోమేపల్లి సాంబయ్య వర్గానికి కాకుండా వేరొకరికి టికెట్ ఇవ్వడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో తమ వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. అప్పుడు సాంబయ్య కుటుంబానికి చెందిన మర్రి రాజశేఖర్‌ను ఇండిపెండెంట్ గా నామినేషన్ వేశారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి ఈ నియోజకవర్గానికి వచ్చినప్పుడు కాంగ్రెస్ శ్రేణులు తమ అసంతృప్తి ఆయన ఎదుట బహిరంగంగా వ్యక్తం చేశాయి. పార్టీ శ్రేణులు నిరసన తెలిపాయి. దీనితో కాంగ్రెస్ నాయకత్వం పరిస్థితిని గమనించి మల్లాది శివన్నారాయణను పోటీ నుంచి తప్పించింది. శివన్నారాయణ తాను పోటీ నుంచి విరమించుకుంటున్నానని, కాంగ్రెస్ శ్రేణులు మర్రి రాజశేఖర్‌కు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకత్వం కూడా చిలకలూరిపేటలో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేయవద్దని, మర్రి రాజశేఖర్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేసింది. రైలింజన్ గుర్తుతో రాజశేఖర్ ఎన్నికల్లో పోటీ చేసి కేవలం 212 ఓట్ల ఆధిక్యతతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందారు. చిలకలూరిపేట చరిత్రలో ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి ఎన్నికల్లో గెలవడం అదే తొలిసారి. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బ్యాలెట్‌లో పేరు ఉన్న మల్లాది శివన్నారాయణకు 7,841 ఓట్లు రావడం విశేషం.


మర్రి రాజశేఖర్


మల్లాది శివన్నారాయణ

విజయోస్తు ఏలూరి

- ఆశీర్వదించిన మహిళలు
- నామినేషన్‌కు తరలిన శ్రేణులు
- దారిపొడవునా నీరజనాలు

మార్టూరు : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఏలూరి అభిమానులు భారీ ర్యాలీగా పర్చూరుకు తరలివెళ్లారు. మండలంలోని క్యాంప్ కార్యాలయంలో ఏలూరి తన సోదరి, తనయుడితో కలిసి ప్రత్యేక పూజలు చేసి వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం బయలుదేరిన ఏలూరికి మహిళలు హారతులిచ్చి, దిష్టితీసి ఆశీర్వదించారు. ఆయన వెంట కార్యకర్తలు కార్లు, ద్విచక్రవాహనాలతో ర్యాలీగా కదిలారు. పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఏలూరి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి జెండాను ఎగురవేశారు. కోనంకి, రాజుగారిపాలెం, ఇసుకదర్శి, వలపర్ల తదితర గ్రామాలకు చెందిన యువకులు, జనసేన, అభిమానులు, బీజేపీ శ్రేణులు చేరుకోగా ఏలూరి ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లగా ప్రధాన సెంటరు, గన్నవరం రోడ్డు మీదుగా బొడ్డురాయి సెంటర్‌కు చేరుకున్నారు. దారి పొడవునా ప్రజలు పూలతో హారతులతో బ్రహ్మరథం పట్టారు. ఆయనను పూల మాలలతో ముంచెత్తారు. అనంతరం వినాయకుని గుడి వద్దకు చేరుకున్న ఏలూరి వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

యనమదల ఆంజనేయస్వామికి పూజలు

వినాయకుని గుడి నుంచి బొబ్బేపల్లి దండుదారి మీదగా యనమదల ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు చేరుకున్న ఏలూరికి చింత పల్లిపాడు, యనమదల, అనంతవరం గ్రామ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ పూజ లు ముగించి, యద్దనపూడి వచ్చిన ఏలూరి ర్యాలీకి యద్దనపూడి మండల నాయకులు స్వాగతం పలికారు. మహిళలు విజయోస్తు ఏలూరి అంటూ నినాదాలు చేశారు. జాగర్లమూడి వెళుతున్న ఏలూరి కాన్వాయ్‌ని పోలూరు రోడ్డు వద్ద నాయకులు ఎదురెళ్లి పూలమాలలతో స్వాగతించారు. మహంకాళి ఆలయం, పెద్దివారిపాలెంలోని ఆంజనేయ స్వామికి ఏలూరి పూజలు చేశారు. అక్కడకు ఇంకొల్లు, పర్చూరు, చినగంజాం మండలాలకు చెందిన యువకులు బైక్ ర్యాలీగా ఎదురు రావడంతో కిటకిటలాడి సందడిగా మారింది. అనంతరం భారీ ర్యాలీగా పర్చూరుకు తరలివెళ్లారు. ఆ యన వెంట మార్టూరు. యద్దనపూడి మండలాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఇంకొల్లు : ఏలూరి నామినేషన్‌కు వందలాది వాహనాల్లో శ్రేణులు, అభిమానులు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, డాక్టరు శ్యాంసుందర్, వీరగంధం ఆంజనేయులు, పాలేరు రామకృష్ణ పాల్గొన్నారు. నక్కలపాలెం, గంగవరం, ఇడుపులపాడు, నాగండ్ల, పావులూరు, భీమవరం, దుద్దుకూరు, గొల్లపాలెం, హనుమోజిపాలెం నుంచి పెద్ద సంఖ్యలో తరళివెళ్లారు.

చినగంజాం : ఏలూరి నామినేషన్ కార్యక్రమానికి 12 గ్రామ పంచాయతీల నుంచి కూటమి శ్రేణులు టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య అధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేసి బస్సులు, కార్లలో పర్చూరుకు వెళ్లారు.



జనసంద్రమైన పర్చూరు

కదంతొక్కిన పసుపు సైన్యం

పర్చూరు : కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి నామినేషన్ కార్యక్రమంలో పసుపు సైన్యం కదంతొక్కారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రసంగం అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి బయలుదేరారు. వేలాదిగా తరలివచ్చిన నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల రాకతో ర్యాలీ ముందుకు సాగని పరిస్థితి కన్పించింది. నామినేషన్ సమయం అయిపోనుండడంతో ఎమ్మెల్యే ఏలూరి ద్విచక్రవాహనంపై కార్యాలయానికి బయలుదేరారు. అయితే ఎమ్మెల్యే ద్విచక్ర వాహనం వద్దకు ప్రజలు భారీగా రావడంతో ముందుకు కదలలేదు. ముహూర్త సమయానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపూడి విజేయ్‌కుమార్, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గుంజి వెంకట్రావు, అడ్వకేట్ కొల్లా నరేంద్రకుమార్ ఏలూరి తరఫున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.



ఏలూరి తరఫున నామినేషన్ అందజేస్తున్న కూటమి నేతలు

అంచనాలకు మించి..

ఎమ్మెల్యే ఏలూరి నామినేషన్ మహోత్సవానికి పార్టీ శ్రేణులు వేసుకున్న అంచనాలకు మించి భారీ ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. దీంతో పర్చూరు పురవీధులు, ప్రధాన రోడ్లు పసుపుమయం అయ్యాయి. పర్చూరు మార్కెట్ యార్డ్ నుంచి బొమ్మల సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు జనసునామీని తలపించింది. దీంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు నానా అవస్థలు పడ్డారు. ఏలూరి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ యువత నినాదాలతో పర్చూరు ప్రాంతం దద్దరిల్లింది.

మహంకాళీ అలయంలో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసిన ఏలూరి

యద్దనపూడి మండలం పెద్ద జాగర్లమూడి గ్రామంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఏలూరి నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి అమ్మ వారి ఆశీస్సులను కోరారు.

కోలలపూడిలో వైసీపీకి షాక్

సర్పంచ్‌తో పాటు 9 మంది వార్డు సభ్యులు టీడీపీలో చేరిక


మార్టూరు, ఏప్రిల్ 22 : మండలంలోని కోలలపూడి గ్రామ సర్పంచ్ మోర పాకుల సతీష్ కుమార్, 9 మంది వార్డు సభ్యులు వైసీపీకి షాక్ ఇచ్చారు. వారంతా టీడీపీలో చేరారు. ఆదివారం రాత్రి కోలలపూడిలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు సమక్షంలో సర్పంచ్ సతీష్ కుమార్ పార్టీలో చేరారు. చేరినవారిలో వార్డు సభ్యులు తాతా శివనాగార్జున, చేబ్రోలు లక్ష్మీ, ఎడవల్లి వెంకటస్వామి, అమరేసు నాగమణి, గాలి నాగేంద్ర, బొబ్బేపల్లి అంజమ్మ, గాలి మేరీ, బొడ్డు యలమంద, బొడ్డు మోహనరావుతోపాటు వైసీపీ నాయకులు తాతా వెంకట్రావు, కొమ్మాలపాటి సుబ్బారావు, గాలి శ్రీనివాసరావు, ఎడవల్లి నాగార్జున,దాసరి వెంకట నారాయణ, గాలి పోలయ్య, రవిబాబు, చేబ్రోలు హనుమంతరావు, నక్క నాగేశ్వరరావు, బుజ్జి, సుబ్బారావు, కుంచాల అంజిబాబు, గొర్రెపాటి నాగయ్య, అల్లరి పిచ్చారావు, పరస రామారావు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, తాటి నాగార్జున, కంది మళ్ల కొండలరావు పాల్గొన్నారు. జడ్పీ మాజీ సీఈవో రాజశేఖర్ ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారిగా సంక్షేమానికి కృషి చేసిన రాజశేఖర్ టీడీపీలో చేరడం వైసీపీ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు.



ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన కోలలపూడి సర్పంచ్, వార్డు సభ్యులు, వైసీపీ నాయకులు

వైభవంగా పోలేరమ్మ వార్షిక తిరునాళ్ల

సంతమాగులూరు, ఏప్రిల్ 22 : మండలంలోని కామేపల్లి గ్రామంలో భక్తుల కోర్కెలు తీర్చే బంగారు తల్లి పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈ మహోత్సవం సందర్భంగా ఆలయంలో పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామేపల్లి గ్రామంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పొంగళ్లు ఒండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పోలేరమ్మ

నేడు వీర్ల గంగమ్మ వార్షిక తిరునాళ్ల

కోడ్‌తో నిలిచిన విద్యుత్ ప్రభలు

బల్లికురవ, ఏప్రిల్ 22 : వీర్ల గంగమ్మ వార్షిక తిరునాళ్ల నేడు మంగళవారం జరుగనుంది. నక్కబొక్కలపాడు గ్రామ పరిధిలో బల్లికురవ సంతమాగులూరు రోడ్డులో ఉన్న వీర్ల గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరగనున్నాయి. క్రీస్తు శకం 11వ శతాబ్దపు కాలంలో అప్పటి రాజులు ప్రతిష్ఠించిన వీర్ల గంగమ్మ అంటే ప్రజలకు ఎంతో నమ్మకం. గంగమ్మ తల్లి నలువైపులా గ్రానైట్ క్వారీలు ఉండడంతో జిల్లా నలు మూలల ఉంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. గత ఏడాది పది విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయగా ఈ ఏడాది ఎన్నికల కోడ్‌తో విద్యుత్ ప్రభలు నిలిచిపోయాయి. దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.



వీర్లగంగమ్మ మూలవిరాట్

నేడు కొణిదెన, కొత్తపాలెంలో స్వామి కల్యాణ వేడుకలు

మండలంలోని కొత్తపాలెం గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం, కొణిదెన గ్రామంలో ఉన్న చెన్నకేశవ స్వామి వారి కల్యాణ వేడుకలు మంగళవారం జరుగుతాయని ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు.

77 మంది వలంటీర్ల రాజీనామా

చినగంజాం, ఏప్రిల్ 22 : మండలం పరిధిలోని 12 గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న 222 మంది వలంటీర్లు గాను 77 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అందజేసినట్లు ఎంపీడీవో యూబీ వరప్రసాద్ తెలిపారు. ఎంపీడీవో ఆఫీస్‌లో చినగంజాం గ్రామ సచివాలయం-1లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు వలంటీర్లు సోమవారం ఎంపీడీవోకు రాజీనామా పత్రాలను అందజేశారు. మోటుపల్లి గ్రామ సచివాలయ పరిధిలో ఒకరు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. మండల పరిధిలో ఇప్పటి వరకు 77 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

కారు - బైకు ఢీ.. ఒకరికి గాయాలు

మేదరమెట్ల, ఏప్రిల్ 22 : జాతీయ రహదారిలో అద్దంకి ప్లై ఓవర్ వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్న కారు, మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో బైకిస్టుకు గాయాలయ్యాయి. సోమవారం ఒంగోలు వైపు నుంచి కారంపూడి వెళ్తున్న మాచర్ల కాంత్రికుమార్ తన కారును మేదరమెట్ల ఫ్లైఓవర్ వద్దకు వచ్చి అద్దంకి వైపు తిరగడం మరచిపోయి ఫ్లైవోవర్ ఎక్కి వెనక్కి తిరిగారు. అదే రోడ్డులో ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న మోటర్ సైకిలిస్ట్ గోనుగుంట సాయి కుమార్ ఆపోజిట్ రోడ్డులో వస్తున్న కారును ఢీకొట్టారు. దీంతో సాయికుమార్ గాయపడ్డారు. గాయపడిన సాయికుమార్‌ను 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ సంఘనట స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయిని ఉదయలక్ష్మికి సన్మానం

ఇంకొల్లు, ఏప్రిల్ 22 : ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి ఎంతోమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను చూపిన ఉపాధ్యాయిని వడ్డవల్లి ఉదయలక్ష్మి అని దగ్గుబాటి విద్యా సంస్థల డైరెక్టర్ చిలుకూరి శ్రీధరరావు అ న్నారు. ఎస్ఆర్ & వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో 36 సంవత్సరాలు పని చేసి హెచ్ఎంగా ఉద్యోగ విరమణ అయిన ఉదయలక్ష్మిని సోమవారం ఘ నంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు ఆమె సేవలను కొనియాడారు. యూటీఎఫ్‌లో కూడా పనిచేసి ఉపాధ్యాయ సమస్యలపై పోరాడిన మహిళా కార్యకర్త ఉదయలక్ష్మి అన్నారు. అనంతరం విశ్రాంత ప్రిన్సిపాల్ కుర్రా హనుమంతరావు, ఉదయలక్ష్మి దంపతులను ఉపాధ్యాయ బృంధం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎం ఈవోలు జయరాజ్, హరిబాబు, రాఘవరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరావు, స్టేట్ కబాడి అసోసియేషన్ సెక్రటరీ కుర్రా భాస్కరావు, డాక్టరు బొర్రా నాగజ్యోతి, కె.వీరాంజనేయులు, సమత, రోటరీ అధ్యక్ష కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి స్వామి, మద్దినేని పాల్గొన్నారు.



ఆరికట్లవారిపాలెంలో ఝాన్సీ ప్రచారం

కూటమి వస్తేనే కష్టాలు తీరుతాయి

ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటి ఝాన్సీ

పంగులూరు, ఏప్రిల్ 22 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజలు కష్టాలు తీరుతాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని గొట్టిపాటి రవి కుమార్ సతీమణి గొట్టిపాటి ఝాన్సీ అన్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం గ్రామంలో సోమవారం కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. ఇంటింటి ప్రచారంలో ఝాన్సీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు ప్రకటించిన పథకాలతో మహిళలకు మేలు చేకూరుతుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, అమ్మకు వందనం కింద చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ.15000 సాయాన్ని అందించనున్నట్లు ఆమె వివరించారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక జరిగిన నష్టాన్ని ప్రజలు తెలుసుకొని ఈ సారి ఎన్నికల్లో విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, మహిళలు పాల్గొన్నారు.



ఆరికట్లవారిపాలెంలో ఝాన్సీ ప్రచారం

ఏలూరి ఆస్తుల విలువ రూ.19.99కోట్లు

పర్చూరు, ఏప్రిల్ 22 : పర్చూరు నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాల్లో ఆయన తన ఆస్తులు, అప్పుల వివరాలను ఆఫిడివిట్‌లో చూపించారు. ఆస్తుల విలవ రూ.19.99 కోట్లు, భార్య మాలతి అస్తులు రూ.187కోట్లు, పెద్దకుమారుడు దివ్యేష్ రూ.41.58కోట్లు, చిన్న కుమారుడు మైనాంక్ తారక్ రూ.41.40కోట్లుగా అఫిడివిట్‌లో పేర్కొన్నారు. తనకు ఎలాంటి అప్పులుగానీ, వాహనాలుగానీ లేవని, తన భార్యకు రూ.8.87కోట్ల అప్పు ఉన్నట్లు పేర్కొన్నారు. ఏలూరిపై గతంలో ఎలాంటి కేసులు నమోదు లేకపోయినా ప్రస్తుత వైసీపీ పాలనలో ఉద్దేశపూర్వకంగా 6 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటికి ఎలాంటి చార్జిషీట్‌లు లేవని తెలిపారు.

నేతన్న.. మా నేస్తం

కొండయ్య కోసం కుమార్తె ప్రచారం

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 22 : ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తరఫున ఆయన కుటుంబ సభ్యులు, ముఖ్య నాయకులు వేర్వేరుగా ముందుకు సాగుతున్నారు. ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతంలో స్థానిక నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ఇంటింటి ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగేవిధంగా ప్రణాళిబద్ధంగా కొండయ్య చేస్తున్న దిశానిర్దేశం మేరకు వారు అడుగులు వేస్తున్నారు. సోమవారం వేటపాలెం మండలం పందిళ్లపల్లిలో టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్యకు మద్దతుగా ఆయన కుమార్తె గోరిపర్తి శివనారాయణదేవి, సీనియర్ నాయకురాలు డాక్టర్ సజ్జా హేమలత, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ ద్వారా కలిగే ప్రయోజనాలను అర్థమయ్యేలా వివరించారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను పోల్చుకుంటే రోజుకు రూ.500 సంపాదించినా నాలుగు వేళ్లా నోట్లోకి వేళ్లే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి మారాలంటే సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రం అభివృద్ధి వైపు నడవాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను ఆశీర్వదించడం ఒక్కటే మార్గమన్నారు. ఈ సందర్భంగా ఆమె నేత కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని చోట్ల మగ్గంపై తాను కూడా పనిచేసి వృత్తిలో పడే కష్టాన్ని స్వయంగా చవిచూశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నేతనేస్తున్న శివనారాయణదేవి

టీడీపీలోకి చేరికలు

మండలంలోని కొత్తపేట ప్రసాదనగరంలో పలువురు టీడీపీలో చేరారు. వారికి కొండయ్య కుమారుడు మహేంద్రనాథ్ కండువాలువేసి పార్టీలోకి స్వాగతించారు. చీరాల మండలం బుర్లవారిపాలెంలో పలువురు టీడీపీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకోటేశ్వరస్వామికి న్యాయాధికారి పూజలు

చినగంజాం, ఏప్రిల్ 22 : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలోని శ్రీలలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఒంగోలు స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయాధికారి రామరాజు వెంకటేశ్వరశర్మ సోమవారం సందర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. అనంతరం న్యాయాధికారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను అర్చకులు తెలియజేశారు.



రాజకోటేశ్వరస్వామి ఆలయంలో న్యాయాధికారి రామరాజు కుటుంబం

పది ఫలితాల్లో మెరిసిన బాలికలు

మండలాలవారీగా ఉత్తీర్ణత శాతాన్ని వెల్లడించిన ఎంఈవోలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 22 : పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలోను, ప్రైవేట్ పాఠశాలలోను మంచి ఉత్తీర్ణత సాధించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో బాలికలు నిలిచారు. విద్యాశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మాయపాలెం జడ్పీ హెచ్ఎస్‌కు చెందిన ఎస్‌వీ పార్థసాయి 577/600 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో ధేనువకొండ జడ్పీహెచ్ఎస్ చెందిన అరవింద్‌బాబు, తృతీయ స్థానంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన జి.పూజితాంజలి నిలిచారు. గురుకుల బాలిక జూనియర్ కళాశాలకు చెందిన జ్యోస్న 566 శంఖవరప్పాడు జడ్పీహెచ్ఎస్‌కు కోటేశ్వరరావు 562, ధర్మవరం జడ్పీహెచ్ఎస్ నుంచి శ్రీనిజా 546, బొమ్మనంపాడు జడ్పీహెచ్ఎస్ నుంచి ఏ.కల్యాణ్ 539, చక్రాయపాలెం జడ్పీహెచ్ఎస్ నుంచి కె.అభిలాష్ 534, కాకానిపాలెం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన బి.శ్రీను 522, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన కె.చరణ్ 510 మార్కులు, గురకాయపాలెం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన గంగయ్య 508, మైలవరం జడ్పీ స్కూల్ అభిషేక్ 498, ఎస్టీ గురుకులంలో శ్రీలం రాజు 486 మార్కులు సాధించారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలలు హోలిపెయింత్‌కు చెందిన కె.జహ్నవి 593తో ప్రథమ, భాష్యంలో జి.లక్ష్మీశృతి 592, శ్రీ చైతన్య నిహిత 591, బెల్ అండ్ బెనెట్‌లో ఎన్.సాత్విక 587, భవిష్య స్కూల్ షేక్ ఫౌజియా 586, ఆర్కిడ్స్‌కు చెందిన ఎస్.శ్యామలదేవి 583, గ్రావిటీగ్లోబల్ ముకుందా మణిదీప్, సెయింట్ జోసెఫ్‌లో ఆశీష్ నిహాల్ 581, శ్రీ నాగార్జున స్కూల్ కె. నవ్యశ్రీ 575, వి శ్వభారతి కామినేని పవన్ కల్యాణ్ 531 మార్కులు సాధించారు. మండలంలో మొత్తం 1189 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1109 మంది ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పర్చూరు : పదవ తరగతి ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. సోమవారం విడుదల చేసిన పరీక్షా ఫలితాల్లో పర్చూరు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి గ్రామీణ ప్రాంత ఖ్యాతిని చాటారు. ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన ఒగ్గిశెట్టి అక్షయ 594/600తో ప్రథమ స్థానంలో నిలవగా, వల్లభరెడ్డి హిమజ 592, శ్యామలా తనూజ 591, జి.యామిని 590 సాధించారు. మొత్తం 190కి 187 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల నిర్వహకులు లక్ష్మయ్య తెలిపారు. శారదాలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాంటెండ్ కృష్ణంశెట్టి రామకోటేశ్వరరావు తెలిపారు. అందులో వి.నందిని 591కి వచ్చినట్లు చెప్పారు. శ్రీ శాతవాహనలో మొత్తం 47కు 46 మంది ఉత్తీర్ణత సాధించటం జరిగిందని పాఠశాల డైరెక్టర్ తేళ్ల రాము తెలిపారు. ఏఎన్‌వీఎస్ బాలికల పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిట్లు క్రిష్ణంశెట్టి రమేష్‌బాబు తెలిపారు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో మొత్తం 43 మందీ పాసయ్యారు. బత్తుల నందిని 591 సాధించినట్లు యాజమాన్యం తెలిపింది. గురుకుల పాఠశాలలో మొత్తం 81 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ విశ్వరాణి తెలిపారు.

చీరాలటౌన్ : టెన్త్ ఫలితాల్లో చీరాల సందీప్ ఇంగ్లీష మీడియం స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎస్.అక్షయ 590, పి.సాలెహా 590 సాధించారు. 45 మందిలో 43 మంది పాసయ్యారు. వీరిలో 17 మంది 500కు పైగా సాధించారు. స్కూల్ వ్యవస్థాపకుడు డా.టి.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వై.అనంత లక్ష్మి, ఉపాధ్యాయులు లావణ్య, ఉమాదేవి, శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

బల్లికురవ : పదో తరగతి పరీక్షల ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. బల్లికురవ మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయంలో 439 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 414 మంది ఉత్తీర్ణులయ్యారు. మండల స్థాయిలో 94 శాతం లభించింది. కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన జీ లక్ష్మీలావణ్య 585 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. బల్లికురవ ఉన్నత పాఠవాలకు చెందిన విద్యార్థి సీహెచ్.సత్యసాయి జతిన్ 582 మార్కులు సాధించి రెండో నిలిచాడు. కొణిదెన ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ అంజనిసీకుమారి 567 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచింది. బల్లికురవ ఉన్నత పాఠశాలలో 92 శాతం, కొమ్మినేనివారిపాలెం పాఠశాల 92 శాతం, కొణిదెన 93 శాతం, కొప్పెరపాడు, 97 శాతం, పెద అంబడిపూడి 98 శాతం, ఉప్పుమాగులూరు 98 శాతం, వైదన, 96 శాతం, కూకట్లపల్లి, 70 శాతం, కేజీబీవీ విద్యాలయం 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అయా పాఠశాలలో పాసైన విద్యార్థులను ఎంఈవోలు వస్రాం నాయక్, రమేష్ ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

పంగులూరు : టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల బాలికలు మంచి మార్కులు సాధించారు. పంగులూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని పూల నాగప్రణతి 585 ప్రథమ, బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ గౌస్‌బాషా 578, చందలూరు ఉన్నత పాఠశాల బాలికలు జాహ్నవి, చంద్రిక 576తో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అలవలపాడు విద్యార్థులు నూరుశాతం సాధించారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో 72 మంది రాయగా 71 మంది ఉత్తీర్ణత సాధించారు. చందలూరులో 129కి 127 మంది పాసయ్యారు. కొండమంజులూరు 64కు 62 మంది, ముప్పవరంలో 43కి 42 మంది, బూదవాడలో 41కి 40 మంది, బూదవాడలో 15 మంది, అలవలపాడు పాఠశాలలో ఇద్దరు, పంగులూరులో 13 మంది, చందలూరులో 10 మంది 550కి పైగా, 34 మంది 500లకు పైగా మార్కులు సాధించారు. అలవలపాడు విద్యార్థిని నన్నేబీ 561, కొండమంజులూరు పి. యశ్వంత్ 537 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. మండల స్థాయిలో 585 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచి పాఠశాలకు పేరు తెచ్చిన విద్యార్థిని పూల నాగ ప్రణతిలో పాటు ఆ బాలిక తల్లిదండ్రులు కృష్ణప్రసాద్, సప్నలను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి సంఘ ప్రతినిధులు అభినందించారు.

మార్టూరు : పదవతరగతి పరీక్షల ఫలితాలలో మార్టూరు మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు చెందిన విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వస్రాం నాయక్ తెలిపారు. మండలంలో 1012 విద్యార్థులు పరీక్షలు రాయగా 974 మంది ఉత్తీర్ణులయ్యారు. వలపర్ల జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్‌కె నాగూర్ వలి 591తో మండలంలో మొదటి స్థానంలో నిలవగా, ద్రోణాదుల హైస్కూల్‌కు చెందిన పీ పూజిత 585 రెండో స్థానం సాధించింది. రాయల్ హైస్కూల్‌కు చెందిన మహేష్‌బాబుకు 590 వచ్చాయి. 8 ప్రభుత్వ జడ్పి హైస్కూల్స్ లో 5 జడ్పి హైస్కూల్స్ లో నూరు శాతం ఉత్తీర్ణత సాదించారు. కాగా నాగూర్‌వలిని ఉపాధ్యాయులు అభినందించారు. యద్దనపూడి గురుకులంలో 76కు 76 మంది పాసయ్యారు. రోజశ్రీ 574 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంఈవో సుబ్రమణ్యే శ్వరరావు, చిలుకూరి గోపీ తెలిపారు.

ఇంకొల్లు, ఏప్రిల్ 22 : టెన్త్ ఫలితాల్లో ఎంఆర్ఆర్ ప్రకాశం హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ తోటకూర అంకబాబు తెలిపారు. మాగులూరి శ్రీముఖి 593 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలవగా, గూండావరపు వెంకటనిశాంత్ 578, సయ్యద్ ముఖ్తరిన్ 570, షేక్ కౌసర్ 568 సాధించినట్లు చెప్పారు. మొత్తం 37కు గాను 27 మంది 500పైగా, 12 మందికి 550 మార్కులు వచ్చినట్లు అంకబాబు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీముఖిని ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ అంకబాబు కృతజ్ఞతలు తెలియజేసారు. పూసపాడు అడ్డరోడ్డులోని డ్రీమ్స్ మరియు యూనివర్సల్ విద్యార్థులు మోదుగుల శైలేశ్వరి 593, నిఖిత 593, సాయిహర్షితారెడ్డి 590 మార్కులు సాధించగా 550పైగా 119 మంది మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ పేర్ని సతీష్‌చంద్ర తెలిపారు. దుద్దుకూరు ఆచార్యరంగా జడ్పీ ఉన్నత పాఠశాలలో 39కి 38 మంది పాసయ్యారు. పాదర్తి ప్రణీత 550 మా ర్కులు సాధించిందని హెచ్ఎం శ్రీనివాసాచార్యులు తెలిపారు.

మేదరమెట్ల : కొరిశపాడు మండలంలో 449 మంది పరీక్షలు రాయగా, 406 మంది పాసయ్యారు. 90.42శాతం ఉత్తిర్ణత సాధించారు. దైవాలరావూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 26 మంది హాజరు కాగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. రావినూతల హైస్కూల్‌కు చెందిన ఎం.మనీషా 574, మేదరమెట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఉమామహేశ్వరి 572 మార్కులు సాధించింది. మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన ఇద్దరు బాలికలు 589, 588 మార్కులు సాధించారు. పమిడిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 49 మందికి 44 మంది పాసయ్యారు. మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులతో పోటీ పడడం పట్ల ప్రజలు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పదివ తరగతి ఫలితాలను ఎంఈవో ఎల్.పున్నయ్య తెలిపారు.

సంతమాగులూరు : టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ జడ్పీ హైస్కూలు విద్యార్థులు సత్తాచాటారని ఎంఈవో కోటేశ్వరరావు తెలిపారు. ఏల్చూరు హైస్కూల్ విద్యార్థి సాత్విక 588, 580, వెల్లలచెరువు హైస్కూల్‌లో భాను ప్రకాష్ 577, మక్కెనవారిపాలెం హైస్కూల్‌లో సూర్యనారాయణ 572, వైష్ణవి 565, 563 మార్కులు సాధించగా, కేజీబీవీ ఏల్చూరులో ప్రశస్త 558 మార్కులు సాధించినట్లు ఎంఈవో కోటేశ్వరరావు తెలిపారు. మండలంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 475 మంది పరీక్షలు రాయగా, 443 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో తెలిపారు.